మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 6-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 157 Issue: 157

06 డిసెంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:36 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః విదియ రా. 9:30 వరకు తరువాత తదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మృగశిర ఉ. 8:48 వరకు తరువాత ఆరుద్ర ఉ. 6:13౦ వరకు యోగం శుభ రా. 11:41 వరకు కరణం తైతుల ఉ. 11:10 వరకు గరజ రా. 9:30 వరకు వర్జ్యం సా. 4:17 నుండి సా. 5:43 వరకు దుర్ముహూర్తం ఉ. 8:05 నుండి ఉ. 8:49 వరకు రాహుకాలం ఉ. 9:22 నుండి ఉ. 10:44 వరకు యమగండం మ. 1:29 నుండి మ. 2:52 వరకు గుళికాకాలం ఉ. 6:36 నుండి ఉ. 7:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:00 నుండి తె. 5:48 వరకు అమృత ఘడియలు రా. 9:17 నుండి రా. 10:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:29 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com





## కోర్టుకు రాకపోవడం నా తప్పే..

### హైకోర్టు ముందు రంగనాథ్ హాజరు

**బతుకమ్మకుంట కట్టడాల కూల్చివేతపై కోర్టు ఫైర్**

**ఉత్తర్వులు ఉన్నా ఎలా కూలుస్తారని ఆగ్రహం**

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): హైకోర్టు ఎదుట హాజరు కాకపోవడంపై ధర్మాసనానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షమాపణ చెప్పారు. శుక్రవారం విచారణకు వ్యక్తిగతంగా హాజరైన ఆయనపై కోర్టు మరోసారి మొట్టికాయలు వేసింది. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా బతుకమ్మకుంట పరిధిలోని కట్టడాలను ఎందుకు కూల్చివేశారని ప్రశ్నించింది. కోర్టు వివాదంలో ఉన్న తరువాయి 2 వ పేజీలో...



## హిల్ట్‌పై మీరేమంటారు?

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు**

**తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా**

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంతీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్(హిల్ట్) పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉ ందని హైకోర్టుకు కు తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు తరువాయి 2 వ పేజీలో...



## ఆలయాల ఆస్తులు దేవుడివే

**బ్యాంకులు వాడుకోవద్దు**

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు**

న్యూఢిల్లీ: దేవాలయాల ఆస్తులు, సంపదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక సంచలన తీర్పు వెలువరించింది. ఆలయాల సంపద దేవుడికే చెందుతుందని, దాన్ని సహకార బ్యాంకుల మనుగడ కోసం వినియోగించరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది. దేవాలయానికి తరువాయి 2 వ పేజీలో...

## ఏప్రిల్‌లో రెండో విడత



### ఇందిరమ్మ ఇళ్లపై పొంగులేటి ప్రకటన

**తొలి విడతలో 4 లక్షల ఇళ్లు ఇచ్చాం**

**మార్చి నాటికి లక్ష ఇళ్లు పూర్తి: పొంగులేటి**

తెలంగాణలో తొలి విడతలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ద ప్రభుత్వం.. మరిన్ని ఇళ్లను నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఇవన్నీ వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. అయితే, పట్టణాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించబోయే ఇళ్లపై కీలక ప్రకటన చేశారు.రానున్న మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను వచ్చే సంవత్సరం మంజూరు చేస్తామని తెలిపారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 4 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. వీటిలో వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. 2026, ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయించే బాధ్యత తమ సర్కార్‌దే అని మంత్రి స్పష్టం చేశారు. మధ్యతరగతి కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాజాగా సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడుతూ ఆయన ఈ ప్రకటన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతిళ్లు నిర్మించి ఇచ్చేందుకు తమ ప్రభుత్వంతరువాయి 2 వ పేజీలో...

## పైలట్ల విధులపై ఊరట

**ఇండిగో సంక్షోభంతో సడలింపు**

**డీజీసీఏ కీలక నిర్ణయాలు**



న్యూఢిల్లీ: ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభంతో లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడటంతో.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. పైలట్ల విధులకు సంబంధించి ఇండిగోకు ఊరట కల్పించేలా నిబంధనలను కాస్త సడలించింది. పైలట్ల వీక్లీ రెస్ట్ నిబంధనలో మార్పులు చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. వందలాది సర్వీసుల రద్దుతో సతమతమవుతోన్న ఇండిగో.. నిబంధనల సడలింపు కోసం డీజీసీఏను ఆశ్రయించింది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్‌ను ఉపశమనం కల్పించాలని కోరింది. ఇండిగో అభ్యర్థనను పరిశీలించిన డీజీసీఏ.. ఎయిర్‌లైన్ల పైలట్ల తరువాయి 2 వ పేజీలో...

## రెపో రేటు 0.25% తగ్గింపు



## మధ్యతరగతికి మహాప్రసాదం

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే దిశగా రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి కమిటీ (MPC) సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ తగ్గింపుతో రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది.

**5.25 శాతానికి చేరిన వడ్డీ రేటు**

**ఆర్థిక వ్యవస్థలోకి లక్ష కోట్ల నగదు**

**జీడీపీ వృద్ధి అంచనా 7.3 శాతానికి పెంపు**

న్యూఢిల్లీ: ఈ సందర్భంగా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యతను పెంచేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి అదనంగా 5 బిలియన్ డాలర్ల విలువైన డాలర్–రూపాయి స్వాప్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు




| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,993 |
| వెండి (గ్రాము): | రూ.196 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,748 |

## ఆంక్షలున్నా తగ్గం!

**మరింత తక్కువ ధరకు చమురు.. భారత్‌కు మా సంపూర్ణ మద్దతు**

**'రక్షణ'ను మరింత విస్తరిస్తాం.. రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి**

**ఉగ్రవాదంపై కలిసి నడుద్దాం.. పిలుపునిచ్చిన ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ : భారత్‌కు చమురు సరఫరాలో తగ్గేదే ఉండదని, ఇంకా చౌకకే అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. భారత్–రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం ఢిల్లీ వచ్చిన ఆయన సమావేశానంతరం మాట్లాడుతూ.. భారత్‌కు రష్యా చమురు సరఫరాను నిరంతరాయంగా కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు తేల్చి చెప్పారు.రష్యా నుంచి చౌక చమురు కొనుగోలు చేయకుండా అమెరికా భారత్‌ను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలను పుతిన్ సవాల్ చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా నుంచి నిరాటంకంగా ఇంధన సరఫరా జరిగేలా చూస్తామని తెలిపారు. మోదీతో సమావేశానికి ముందు తరువాయి 2 వ పేజీలో...



## ఢిల్లీనైనా ఢీ కొడతా

**రాష్ట్రానికి నిధుల కోసం కొట్లాడుతా**

**అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా**

**నర్సంపేటలో సీఎం రేవంత్ స్పష్టీకరణ**

**532 కోట్ల పనులకు శంకుస్థాపనలు**

నర్సంపేట, వరంగల్, డిసెంబర్ 5 (ఈవార్తలు): 'తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా. నిధులు తీసుకొస్తా. అడగాడనికి వెనుకాడను. రాకపోతే కొట్లాడటానికి అసలే భయపడను. రాష్ట్రానికి కావలసిన నిధులు, రావలసిన అనుమతుల -2 వ పేజీలో...

### విశ్వవాణి



260 కోట్ల సంవత్సరాలు చేస్తేనే ఫలితం వచ్చే లెక్కలను క్వాంటం కంప్యూటర్ కేవలం నాలుగు నిమిషాల్లోనే ఫలితాన్ని ఇచ్చింది. క్వాంటం కంప్యూటర్ల పనితీరుకు ఇది నిదర్శనమని, విప్లవాత్మకం అని, ఇంత తక్కువ వ్యవధిలోనే లెక్క చేస్తుందని తాము ఊహించలేదని శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## అభివృద్ధికి గ్లోబల్ సమ్మిట్

**'రైజింగ్'పై సోనియాగాంధీ సందేశం.. సీఎం రేవంత్‌కు అభినందనలు**



హైదరాబాద్/న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో జరగనున్న రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్పందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ సమ్మిట్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆమె సందేశం పంపించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని అన్నారు.అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ తరువాయి 2 వ పేజీలో...

## లంచగొండి అడిషనల్ కలెక్టర్

**హనుమకొండ ఏసీ 60 వేలు లంచం డిమాండ్**

**వల వేసి పట్టుకున్న ఏసీబీ**

**హనుమకొండ కలెక్టరేట్‌లో సోదాలు**

హనుమకొండ, డిసెంబర్ 5 (ఈవార్తలు): హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డారు. రూ. 60 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. హనుమకొండ అదనపు కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి వెంకట్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన రూ.60,000 లంచం -2 వ పేజీలో...



## ఎన్‌కౌంటరా? హత్యా?

**నిజనిర్ధారణకు ఓయూ, కేయూ విద్యార్థులు**

**అడ్డుకున్న చింతపల్లి పోలీసులు.. స్టేషన్‌కు తరలింపు**

అల్లూరి జిల్లా, డిసెంబర్ 5 (ఈవార్తలు ): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మారేడుమిల్లిలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ కోసం వెళ్తున్న ఓయూ, కేయూ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థుల బృందాన్ని చింతపల్లి పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. సుమారు 20 నుంచి 25 మంది విద్యార్థులు రెండు వాహనాల్లో మారేడుమిల్లి వైపు వెళ్తుండగా, చింతపల్లి–భద్రాచలం రోడ్డులో ఏడుకొండల సమీపంలో పోలీసులు, స్థానిక గిరిజన గ్రామస్థులతో కలిసి బారికేడ్లు వేశారు. అనంతరం -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

6.12.2025

మేషం: ఉద్యోగాలలో అధికారుల ఆగ్రహానికి గురి అవుతారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు కష్టసాధ్యంతో పూర్తవుతాయి. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో మతాపట్టింపులు తప్పవు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసి వస్తాయి. నూతన ఉద్యోగ అవకాశలు అందుతాయి. అవసరానికి ఇతురుల నుండి ధన సహాయం అందుతుంది. సోదరులతో మనస్పర్ధలు తొలగుతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది.

మిధునం: నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. నేత్ర సంభందిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. నూతన వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు అధికారుల నుండి సమస్యలు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది.

కర్కాటకం: వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి కలుగుతుంది.

సింహం: ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది.

కన్య: బంధు మిత్రుల సహాయ సహకారాలతో పూర్తి చేస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. గృహమున శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది.

తుల: ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది. బంధువులలో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగమున చాలా కాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు విఫలమౌతాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది.

ధనస్సు: నిరుద్యోగులకు అధిక కష్టం మీద అల్ప ఫలితం పొందుతారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. సంతాన వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

మకరం: నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు కలసి వస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

కుంభం: వ్యాపారాలలో శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. బంధు మిత్రులతో సఖ్యత పెరుగుతుంది.

మీనం: ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. మంచి ఆలోచన జ్ఞానంతో ముందుకు సాగుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూరప్రాంతాల బందు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి.

# హిల్ట్‌పై మీరేమంటారు?

**మొదటి పేజీ తరువాయి**

చేయించాలని కోరుతూ పర్యావరణవేత్త పురుషోత్తం, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తమ పిటిషన్లలో కోరారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉందని, ఇందులో భారీ అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. పిటిషన్లను విచారణకు స్వీకరించిన హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ నెల 29కి తదుపరి విచారణ వాయిదా వేసింది. హిల్ట్ పాలసీ తెలంగాణ రాజకీయాల్లో హిల్ట్ తీవ్ర చర్చలకు దారితీస్తోంది. రూ.5లక్షల కోట్లు విలువైన భూములను రేవంత్ ప్రభుత్వం 5వేల కోట్లకే అమ్ముకునే ప్రయత్నం చేస్తుందని..రాష్ట్ర ఖజనాకు గండిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీఎం తన అనునయులకు భూములు కట్టబెట్టేందుకు హిల్ట్ పాలసీ తెచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వాలు బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్లలో 9,300 ఎకరాల పారిశ్రామిక భూములను రాయితీ ధరలకు కేటాయించాయి. ఇవి పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం మాత్రమే ఇచ్చినవి. కానీ హిల్ట్ పాలసీ ద కింద, ఈ భూములను వాణిజ్య, నివాస జోన్లుగా మార్చుకోవచ్చు. ఇందుకోసం సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్వో) విలువలో 30% మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మార్కెట్ ధరలు ఎస్ఆర్వో కంటే 4-5 రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం రూ.5,000 కోట్లు మాత్రమే సేకరించగలదనీ, ఇది రాష్ట్ర బడ్జెట్‌కు రెండు రెట్లు సమానమైన నష్టమని కేటీఆర్ లెక్కల్లో చూపించారు. పార్టీ పరంగా నిజనిర్ధారణ కమిటీలు వేసి భూముల వాస్తవ పరిస్థితిపై విచారణ కొనసాగిస్తున్నారు. అటు బీజేపీ కూడా హిల్ట్ పాలసీతో లక్షల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందంటూ గవర్నర్ కు ఫిర్యాదు చేసింది. అయితే హిల్ట్ పాలసీపై వస్తున్న ఆరోపణలని మంత్రి శ్రీధర్ బాబు ఖండించారు. ఈ పాలసీలో లీజు భూములను కన్వర్షన్‌కు అనుమతే లేదని చెప్పారు. "పట్టాలు ఉండి, సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టాం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రావేత్తలకు ఇస్తూ జీవో తెచ్చారని విమర్శించారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం హిల్ట్ ద్వారా మేం చేస్తున్నాం. ఈ పాలసీలో ఎస్ఆర్ఓ రేటు కన్నా ఎక్కువ ఫీజు పెట్టాం" అని ఆయన చెప్పారు.



## ఆలయాల ఆస్తులు దేవుడివే

**మొదటి పేజీ తరువాయి**

చెందిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ అక్కడి సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "సహకార బ్యాంకులను కాపాడటానికి గుడి డబ్బును ఉపయోగిస్తారా? దేవుడి డబ్బు కేవలం ఆలయ ప్రయోజనాల కోసమే వాడాలి. అది బ్యాంకులకు ఆదాయ మార్గం కాకూడదు" అని ఆయన అన్నారు. కష్టమర్ల నుంచి డిపాజిట్లు రాబట్టుకోలేకపోవడం అనేది సహకార బ్యాంకుల సమస్య... అందుకు దేవుడి సొమ్మును వాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల నుంచి నమ్మకాన్ని పొందడంలో బ్యాంకులు విఫలమైతే అది వాటి సమస్యేనని పేర్కొంటూ, సహకార బ్యాంకుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దేవాలయాల డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ కేరళ హైకోర్టు తీర్పును సమర్థించింది.

# కోర్టుకు రాకపోవడం నా తప్పే..

**మొదటి పేజీ తరువాయి**

బతుకమ్మకుంట పరిధిలోని స్థలం విషయంలో స్టేటస్ కో కొనసాగించాలని జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై ఏ సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన కోర్టు ధికరణ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. ఈ విచారణకు రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ పిటిషన్‌పై తొలుత అక్టోబర్ 31వ తేదీన విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని దో నవంబర్ 27న రంగనాథ్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నవంబర్ 27న విచారణ జరిపిన ధర్మాసనం రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదిస్తూ, రంగనాథ్ అధికారిక విధుల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేదని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. 'రంగనాథ్ కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణ చర్యలు ఉంటాయని, ఇదే కోర్టు హాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబెట్టిస్తామని వార్నింగ్ ఇచ్చింది. కోర్టుకున్న అధికారాలను రంగనాథ్ మరచిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి పరిస్థితులను రంగనాథ్ తెచ్చుకోవద్దని సూచించింది. డిసెంబర్ 5న జరిగే విచారణకు వ్యక్తిగతంగా రంగనాథ్ హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. లేకపోతే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో శుక్రవారం నాడు రంగనాథ్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారిస్తూ.. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా ఎందుకు కూల్చారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. దీనికి వ్యర్థాలనే తొలగించామని హైకోర్టుకి రంగనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

## ఏప్రిల్‌లో రెండో విడత

**మొదటి పేజీ తరువాయి**

కట్టుబడి ఉందని ఆయన మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి.. జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతుందని పేర్కొన్నారు.

## మధ్యతరగతికిమహాప్రసాదం

**మొదటి పేజీ తరువాయి**

8.2 శాతానికి చేరడం, ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు 'గోల్డెన్ పీరియడ్' అని ఆయన అభివర్ణించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వల్లే వృద్ధికి మద్దతుగా వడ్డీ రేట్ల కోతకు అవకాశం లభించిందని వివరించారు. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో దేశ జీడీపీ వృద్ధి అంచనాను కూడా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ద్రవ్య విధానంలో తటస్థ వైఖరిని కొనసాగించాలని నిర్ణయించినట్లు మల్హోత్రా స్పష్టం చేశారు. ఆగస్టు, అక్టోబర్ నెలల్లో జరిగిన సమీక్షల్లో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదని గుర్తుచేశారు. దేశ విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయని, ఇది 11 నెలల దిగుమతులకు సరిపోతుందని తెలిపారు. అయితే, ప్రపంచ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూల అంశాలుగా కొనసాగుతున్నాయని హెచ్చరించారు. ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రయోజనాలను వాణిజ్య బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు అందిస్తాయన్న దానిపైనే అసలైన ఫలితం ఆధారపడి ఉంటుంది.

## అభివృద్ధికి గ్లోబల్ సమ్మిట్

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిభ అభివృద్ధికి ఈ సదస్సు మరింత తోడ్పడుతుందని అన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సును నిర్వహిస్తున్నందుకు రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# పైలట్ల విధులపై ఊరట

**మొదటి పేజీ తరువాయి**

విధులకు సంబంధించి తాజా మార్పులు చేపట్టింది. అయితే, ఇవి తాత్కాలికం మాత్రమేనని స్పష్టం చేసింది. గతంలో పైలట్లకు వారంలో విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించనున్నట్లు తాజాగా డీజీసీఏ ప్రకటించింది. అంతకుముందు, ఎఫ్‌డీటీఎల్ కొత్త నిబంధనల ప్రకారం.. వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించే అవకాశం లేదు. వీక్లీ రెస్ట్ పీరియడ్, సెలవులును వేర్వేరుగా చూసేవారు. పైలట్ల అలసట సమస్యను పరిష్కరించేందుకు ఈ కఠిన నిబంధనలు తీసుకొచ్చారు. అయితే ఇప్పుడు ఇండిగో సర్వీసుల రద్దు నేపథ్యంలో ఈ నిబంధనను కాస్త సడలించారు. ఇక, పైలట్ల రాత్రి విధులపై ఉన్న నిబంధనలకు సంబంధించి ఇండిగోకు భారీ ఉపశమనం కల్పించింది. పైలట్లు వరుసగా రెండు కంటే ఎక్కువ రాత్రి షిఫ్ట్‌లు చేయకూడదనే నిబంధనను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నట్లు డీజీసీఏ తెలిపింది. ఇండిగో విమానయాన సంస్థకు చెందిన పైలట్లు వారంలో ఆరు నైట్ డ్యూటీలు నిర్వహించే అవకాశాన్ని కల్పించింది. ప్రస్తుతం కొనసాగుతున్న గందరగోళాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీసీఏ తెలిపింది. ఈ మినహాయింపులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు అమల్లో ఉంటాయని వెల్లడించింది. అంతేగాక.. ప్రతి 15 రోజులకోసారి వీటిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

# ఆంక్షలున్నా తగ్గం!

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడిన పుతిన్.. తమ ఇంధనాన్ని అమెరికా కొనుగోలు చేసే హక్కు ఉన్నప్పుడు.. భారత్‌కు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు.



ఉగ్రవాదంపై కలిసి నడుస్తాం: మోదీ

మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. రెండు రోజుల పర్యటన అనంతరం పుతిన్ స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన అధికారిక విందు అనంతరం ఆయన మాస్కోకు బయల్దేరారు.

# ఢిల్లీనైనా ఢీ కొడతా

**మొదటి పేజీ తరువాయి**

కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి అడగడం సీఎంగా నా బాధ్యత. ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.532.24 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహారావు నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియాకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే ప్రక్రియ మొదలవుతుంది. అభివృద్ధి పథంలో సాగాలంటే ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క %-% సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికీ రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రతి గూడెం నుంచి మండల కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమానులుగా.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నాం. ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి. రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం.

## ఎన్‌కౌంటరా? హత్యా?

'మాకొద్దు మావోయిస్టులు.. మాకొద్దు మావోయిస్టులు' అంటూ గ్రామస్తుల ముసుగులో ఉన్న కొందరు ముఖాలకు గుడ్డలు కట్టుకుని విద్యార్థులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల ఐడీ కార్డులు, వాహనాల పత్రాలు పోలీసులు పరిశీలించి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు తాము ఏపీ సర్కారుతో పాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, మావోయిస్టు పార్టీలకు బహిరంగ లేఖ రాశామని తెలిపారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై నిజాలు తెలుసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కానీ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి వెళ్లేందుకు చింతపల్లి పోలీసులు అడ్డుకుంటున్నారని, కాలయాపన చేస్తూ తమను ఎందుకు నిర్బంధించారో చెప్పడం లేదన్నారు. తమ వాహనాలను కూడా స్వాధీనం చేసుకుని తమ స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారని మండిపడ్డారు. ఈ వార్తను కవర్ చేసేందుకు వచ్చిన మీడియా మిత్రులను కూడా లోపలికి రానివ్వకపోవడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల ముసుగులో ఉన్న పోలీసులు తమకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమకు మావోయిస్టులతో, ఏపీ ప్రభుత్వంతో, తెలంగాణ ప్రభుత్వంతో ఎటువంటి సంబంధాలు లేవని, సాధారణ విద్యార్థులుగా కేవలం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వచ్చామని స్పష్టం చేశారు.

# అన్ని కాలాలు అనుకూలంగా ఉండవు

## కష్టాలు వస్తాయి.. వెరవకూడదు.. సర్పంచ్‌లతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**గజ్వేల్ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట సర్పంచ్‌లు ఏకగ్రీవం**

**మర్యాదపూర్వకంగా కేసీఆర్‌తో భేటీ**

గజ్వేల్, డిసెంబర్ 5 (ఈవార్తలు): అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవని, కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయని, వాటికి వెరవకూడదని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మళ్ళీ మన ప్రభుత్వం వస్తుందని, తెలంగాణ పల్లెలకు మంచి రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటిదాకా ప్రజలు అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త సర్పంచ్‌లు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివద్ధి చేసుకునేందుకు ముందుకు సాగాలని సూచించారు. కేసీఆర్ దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్, శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచారు. ఈ రెండు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అధినేతను కలిశారు. నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, గ్రామ ఉప సర్పంచ్ ఎద్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, ఇరు గ్రామాలకు చెందిన ప్రముఖులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారిని కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెందాయని తెలిపారు. స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని అన్నారు. దళిత, గిరిజన, బహుజన, మహిళా వర్గాలకు, కుల వృత్తులకు తాము అందించిన ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధికి అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటు అందించాయని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.



## పవన్‌పై వ్యాఖ్యలు అందుకే

**ఉండవల్లిలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మీద తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నాయకుల దిష్టి తగిలిందని ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేదంటే ఆయన సినిమాలను తెలంగాణలో ఆడనివ్వమని మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు మంత్రి కోమటిరెడ్డి ఏపీకి వెళ్లారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు అలా మాట్లాడానని అన్నారు. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చానని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి ఉండాలని, ఇదే స్నేహం కొనసాగాలని ఆకాంక్షించారు. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపమే హైదరాబాద్ అని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు విజన్‌కు తగినట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని అన్నారు.

## ఈశ్వర్ మరణానికి రేవంతే కారణం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): శ్రీసాయి ఈశ్వర్ మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దారుణ మోసానికి ఈశ్వర్ నిండు ప్రాణం బలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని తట్టుకోలేక శ్రీసాయి ఈశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికి కుదించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే అని ఆయన విమర్శించారు. కులగణన మొదలు న్యాయస్థానాల్లో నిలబడని జీవోల వరకు కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. శ్రీసాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## నా కొడుకైనా తప్పు చేస్తే శిక్ష తప్పదు: పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): తప్పు చేస్తే తన కుమారుడైనా శిక్షకు అర్హుడేనని, చట్టం ముందు అందరూ సమానమేనని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తన కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై నమోదైన భూ వివాదం కేసుకు సంబంధించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం, ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమిలోకి జేసీబీలతో ప్రవేశించి కూల్చివేతలకు పాల్పడ్డారనే ఆరోపణలతో రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్ష్యాధారాలతో కూడిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, దౌర్జన్యం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయంపై అధికారులతో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, "తప్పు చేసినప్పుడు నేను అయినా, నా కొడుకు అయినా శిక్ష అనుభవించాల్సిందే. ప్రతిపక్షాలు కేసులు పెట్టించాయని చెప్పడం సరికాదు. మేము ప్రభుత్వంలో ఉన్నామని నా కుమారుడిపై కేసు నమోదు చేయవద్దని చెప్పే ఉద్దేశం మాకు లేదు" అని అన్నారు. కేసు నమోదైన తర్వాత విచారణలో నిజ నిర్ధారణ జరుగుతుందని, తప్పు తేలితే చట్ట ప్రకారం శిక్ష పడుతుందని ఆయన వివరించారు. ఒకవేళ ఆరోపణల్లో నిజం లేకపోతే, వార్తలు రాసిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి వ్యాఖ్యానించారు.

## రేవంత్ ఆదేశిస్తే రాజీనామా: దానం

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశిస్తే తాను ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన ప్రకటన చేశారు. పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై సమాధానం ఇచ్చేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మరింత గడువు కోరిన కొన్ని రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేయడం, పోరాడటం తనకు కొత్తేమీ కాదని అన్నారు. తాను ఇప్పటివరకు 11 సార్లు ఎన్నికల బరిలో నిలిచానని గుర్తుచేశారు. ఎమ్మెల్యేల అనర్హత కేసుపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

# హవాలా రాకెట్ గుట్టురట్టు

**రూ.4.05 కోట్లు స్వాధీనం**




హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీసులు భారీ హవాలా రాకెట్‌ను ఛేదించారు. కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.4.05 కోట్ల నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నాగ్‌పూర్ నుంచి బెంగళూరుకు ఈ హవాలా డబ్బును తరలిస్తున్నట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. నార్త్ జోన్ డీసీపీ ఎస్. రష్మీ పెరుమాళ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు, మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బోయిన్‌పల్లి పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్న హ్యుందాయ్ క్రెటా కారులో ప్రయాణిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను గుజరాత్‌కు చెందిన వ్యాపారులు ప్రకాశ్ మోతీభాయ్ ప్రజాపతి (30), ప్రగ్నేశ్ కీర్తిభాయ్ ప్రజాపతి (28)గా గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడైన ప్రకాశ్ ప్రజాపతిపై 2024 డిసెంబర్ 7న బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. హైదరాబాద్ నాగోల్‌కు చెందిన విశ్వనాథ్ చారి అనే వ్యక్తిని క్యాష్-ఆర్‌టీజీఎస్ డీల్ పేరుతో రూ.50 లక్షలు మోసం చేశాడనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ చీటింగ్ కేసు దర్యాప్తులో భాగంగానే ప్రకాశ్ కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, శుక్రవారం అతడిని పట్టుకున్నారు. విచారణలో, తాను రూ.50 లక్షలు మోసం చేసినట్లు, అలాగే రూ.4.05 కోట్ల హవాలా డబ్బును తరలిస్తున్నట్లు ప్రకాశ్ అంగీకరించాడని డీసీపీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు మూలాలు, సంబంధాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

# వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను 'ఉమీద్' పోర్టల్‌లో నమోదు చేసేందుకు విధించిన గడువును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్వాగతించారు. ఈ అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు, ముతావల్లీలకు (ఆస్తుల సంరక్షకులు) ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయంపై కీలక ప్రకటన చేశారు. వక్ఫ్ ఆస్తుల నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసినప్పటికీ, మరో మూడు నెలల పాటు ఎలాంటి జరిమానా విధించబోమని స్పష్టం చేశారు. ఈలోగా నమోదు చేసుకోలేని వారు తమ రాష్ట్రాల్లోని వక్ఫ్ ట్రైబ్యునళ్లను సంప్రదించవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల వక్ఫ్ ఆస్తులకు గాను, ఇప్పటివరకు కేవలం 1.51 లక్షల ఆస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు. గడువు పొడిగించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సాంకేతిక సమస్యలు, శతాబ్దాల నాటి రికార్డుల లభ్యతలో జాప్యం, ముతావల్లీలకు ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆస్తుల వివరాలను కచ్చితత్వంతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు కనీసం ఏడాది పాటు గడువు పొడిగించాలని కోరారు. "వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఈ గడువు పొడిగింపు చాలా ముఖ్యం. దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఈ సంస్థల ద్వారా అందే సేవలు, మద్దతు నిరంతరాయంగా కొనసాగుతాయి" అని మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# సర్వే అధికారి ఇంట్లో 1.6 కిలోల గోల్డ్

**రంగారెడ్డి జిల్లా సర్వే ఏడీ శ్రీనివాసులపై ఏసీబీ కేసు**

**ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో అధికారుల దాడులు**

రంగారెడ్డి, డిసెంబర్ 5 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కె.శ్రీనివాసులుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఈ ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న ఆయనపై కేసు నమోదు చేసి, ఏకకాలంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. శ్రీనివాసులు నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీల ఇళ్లు సహా మొత్తం 6 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు బయటపడినట్లు ఏసీబీ డీజీ చారు సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మైహోమ్ భూజాలో ఒక ఫ్లాట్, నారాయణపేట జిల్లాలో రైస్‌మిల్లు, మూడు ఇళ్ల ప్లాట్లు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాల్లో 11 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గంలోని శ్రీనివాసులు నివాసంలో జరిపిన సోదాల్లో రూ.5 లక్షల నగదు, 1.6 కిలోల బంగారు ఆభరణాలు, 770 గ్రాముల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఆయనకు రెండు కార్లు ఉన్నట్లు కూడా గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ, డాక్యుమెంట్లలో చూపిన విలువ కంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని డీజీ వెల్లడించారు. శ్రీనివాసులుపై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలపై గతేడాది సెప్టెంబరులో నమోదైన కేసులో కూడా ఆయన నిందితుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి ఏడీగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం ఉదయం ప్రారంభమైన సోదాలు రాత్రి 7 గంటల వరకు కొనసాగాయి. అధికారులు కీలకమైన భూ రికార్డులు, కంప్యూటర్, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనంచేసుకున్నారు.



## కరీంనగర్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



హుజూరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో శుక్రవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం... సిర్సపల్లికి చెందిన కొక్కొండ రమేశ్-రజిత దంపతుల పెద్ద కుమారుడు అభిలాష్ (19) సింగాపురం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఇంట్లోని బాత్రూంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అభిలాష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కుమారుడి ఆకస్మిక మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## నియోపొలిస్ భూములతో హెచ్ఎండీఏకు పండుగ

హైదరాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ శివారు ప్రాంతమైన కోకాపేటలోని నియోపొలిస్ భూముల నాల్గవ విడత వేలం ప్రక్రియ ముగిసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నియోపొలిస్‌లోని 15, 16, 17, 18, 19, 20 ప్లాట్‌లలోని భూములను నాలుగు విడతలుగా వేలం వేసింది. ఈ వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ.3,862 కోట్ల ఆదాయం సమకూరింది. నియోపొలిస్ స్థలాలకు అధిక డిమాండ్ ఉండటంతో వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు పోటీపడి భూములను దక్కించుకున్నాయి. శుక్రవారం జరిగిన వేలంలో 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని సీఓఈయూఎస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎకరాకు రూ.77.75 కోట్ల చొప్పున సొంతం చేసుకుంది. నాలుగు విడతలుగా నిర్వహించిన ఈ వేలం పాటలో హెచ్ఎండీఏ గత సంవత్సరం కంటే 87 శాతం అధికంగా ఆదాయం ఆర్జించింది.

## విద్యార్థినిపై వైస్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు!

జడ్చర్ల, డిసెంబర్ 5 (ఈవార్తలు): విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన గురుకుల పాఠశాలలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై మహిళా వైస్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జడ్చర్ల మండల కేంద్రంలోని ఓ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంతో ధైర్యం తెచ్చుకున్న విద్యార్థిని, తనపై జరుగుతున్న అఘాయిత్యాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఆగస్టు నెల నుంచే ఈ వేధింపులకు పాల్పడుతున్నట్లు తేలిందని డీఎస్పీ వెల్లడించారు. నైట్ డ్యూటీ సమయంలో ఆమె విద్యార్థినిని శారీరకంగా, లైంగికంగా వేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ప్రిన్సిపాల్ రజిని రాగమాల బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను బెదిరించినట్లు కూడా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ రజిని రాగమాల ఇద్దరినీ తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వారిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## శంషాబాద్‌లో 92 'ఇండిగో'లు రద్దు

శంషాబాద్, డిసెంబర్ 5 (ఈవార్తలు): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ సేవల రద్దుతో నెలకొన్న గందరగోళం కొనసాగుతోంది. వరుసగా నాలుగో రోజైన శుక్రవారం కూడా ఇండిగో ఏకంగా 92 విమానాలను రద్దు చేయడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎయిర్‌పోర్ట్ ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం రద్దు చేసిన విమానాల్లో 43 రాకపోకలు, 49 బయలుదేరే సర్వీసులు ఉన్నాయి. గత నాలుగు రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు కావడం ఇదే తొలిసారి. గురువారం 74 విమానాలను రద్దు చేసిన ఇండిగో, ఈ నెల 2 నుంచి ఇప్పటివరకు మొత్తం 220 సర్వీసులను నిలిపివేసింది. ఈ వరుస రద్దులతో విసిగిపోయిన ప్రయాణికులు టెర్మినల్ భవనంలో ఆందోళనకు దిగారు. ఇండిగో సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగి, తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ నిలదీశారు. చెక్-ఇన్ ప్రక్రియ పూర్తయ్యాక విమానాలను రద్దు చేస్తున్నారని కొందరు ప్రయాణికులు ఆరోపించారు.

## గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం**

వేములవాడ, డిసెంబర్ 5 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల కోలాహలం నడుమ రాజన్న సిరిసిల్ల జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రజా సేవ చేయాలనే ఆశయంతో సర్పంచ్ బరిలో నిలిచిన ఓ అభ్యర్థి, గెలుపు ముంగిట గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వేములవాడ అర్బన్ మండలం, చింతల్‌ఠానా గ్రామంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. చింతల్‌ఠానా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో చెర్ల మురళి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం పలు ప్రణాళికలతో ఆయన ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, గురువారం ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సర్పంచ్‌గా గెలిచి గ్రామస్థులకు సేవ చేయాలన్న తన కల నెరవేరకుండానే ఆయన అర్ధాంతరంగా తనువు చాలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## మరోసారి విదేశీ పర్యటనకు లోకేశ్

అమరావతి, డిసెంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆయన అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. పర్యటనలో భాగంగా డిసెంబర్ 6న లోకేశ్ అమెరికాలోని డల్లాస్‌లో జరిగే తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 8, 9 తేదీల్లో శాన్ ఫ్రాన్సిస్కో వేదికగా పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10వ తేదీన కెనడాలోని టొరంటోలో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి. గత 18 నెలల కాలంలో పెట్టుబడుల సాధన కోసం లోకేశ్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న బ్రాండ్ ఇమేజ్, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించడంలో ఈ పర్యటనలు విజయం సాధించాయి. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్)కు భారీగా పెట్టుబడులు తరలిరావడంలో ఈ పర్యటనలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో లోకేశ్ అమెరికాలో పర్యటించడం ద్వారా గూగుల్ ను రాష్ట్రానికి రప్పించగలిగారు. ఈసారి కూడా లోకేశ్ భారీ పెట్టుబడులు సాధించుకువస్తారని కూటమి ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

## అమెరికాలో తెలుగు విద్యార్థులకు గాయాలు

విజయవాడ, డిసెంబర్ 5 (ఈవార్తలు): అమెరికాలోని అలబామా రాష్ట్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బర్మింగ్‌హామ్ నగరంలో తెలుగు విద్యార్థులు నివసిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన వీరు అలబామా యూనివర్సిటీలో చదువుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 10 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని ఒకే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరుంటున్న భవనంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.



# దత్తాత్రేయస్వామి సేవలో పొన్నం, ఆది

బోయినపల్లి, డిసెంబర్ 5 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్.. దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మిడ్ మానేరులోని స్పీడ్ బోట్‌లో పొన్నం ప్రయాణించారు. అనంతరం మాట్లాడుతూ.. దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా రాష్ట్రం మంచి వర్షాలతో ప్రజలంతా అందరూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నానని తెలిపారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దత్తాత్రేయ స్వామిని దర్శించుకొనేందుకు భక్తుల కోసం ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులకు బోటు సౌకర్యం కల్పించామని వెల్లడించారు. రూ.150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.



# వేములవాడలో భారీ అగ్నిప్రమాదం

## తప్పిన ప్రాణ నష్టం

వేములవాడ, డిసెంబర్ 5 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. యాదవ సంగం సమీపంలో ఉన్న పెరుగు జలంధర్ ఇంటిలో చోటుచేసుకున్న షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి. ఇంట్లో ఉన్న పత్తి భారీగా దగ్ధమవడంతో అగ్ని వేగంగా వ్యాపించింది. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బయటే ఉండటం వలన ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను నియంత్రించారు.

# మన దేశంలో హిందువులకే అవమానాలు

## మత విశ్వాసాల కోసం న్యాయపోరాటాలు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన

చెన్నై: భారతదేశంలో హిందువులు తమ మత విశ్వాసాలను ఆచరించేందుకు న్యాయపోరాటాలు చేయాల్సి రావడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని తిరుప్పరన్‌కుంద్రం కొండపై కార్తీక దీపం వెలిగించే విషయంలో కోర్టు అనుమతి ఉన్నప్పటికీ, అధికారులు అడ్డుకోవడంపై ఆయన స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల వ్యవహారాలను భక్తులే పర్యవేక్షించేలా "సనాతన ధర్మ రక్షా బోర్డు"ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "తిరుప్పరన్‌కుంద్రం, ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలలో మొదటిది. అక్కడ కార్తీక మాసంలో కొండపై దీపాలు వెలిగించడం హిందువుల ప్రాచీన సంప్రదాయం. ఈ రోజు భారతదేశంలో హిందువులు తమ విశ్వాసాలను ఆచరించడానికి, సంప్రదాయాలను పాటించడానికి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి రావడం బాధాకరం, విచారకరం. ఒక నిర్ణయాత్మకమైన న్యాయపోరాటంలో గెలిచిన తర్వాత కూడా, భక్తులు తమ సొంత ఆస్తిపై ఒక చిన్న, శాంతియుతమైన ఆచారాన్ని కూడా పాటించలేకపోతే, ఇక ఈ దేశంలో వారికి రాజ్యాంగబద్ధమైన న్యాయం ఎక్కడ లభిస్తుంది? భారతదేశంలోని హిందువులందరూ ఒక కఠోర నిజాన్ని అర్థం చేసుకోవాలి. దీపం వెలిగించే హక్కు మనకే ఉందని చెన్నై హైకోర్టు




మొదట సింగిల్ జడ్జి ద్వారా, ఆ తర్వాత ఉన్నత ధర్మాసనం ద్వారా ధృవీకరించింది. చట్టపరంగా మనం గెలిచాం. కానీ ఆచరణలో మాత్రం సర్దుకుపోవాల్సి వచ్చింది. మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ఏ మతపరమైన పండుగనైనా ఒక వారం ఆలస్యంగా జరుపుకోగలరా? ఒక పవిత్రమైన రోజు వేడుకను వేరే సమయానికి మార్చగలరా? లేదు. ఎందుకంటే మతపరమైన సమయం, క్యాలెండర్ల పవిత్రత చర్చించలేనివి. అయినా సనాతన ధర్మానికి సంబంధించిన ఆ పవిత్రమైన కార్తీక దీపపు క్షణం దొంగిలించబడింది. అది శాశ్వతంగా మాయమైపోయింది. ఎందుకంటే హిందువులను చులకనగా తీసుకుంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు, ఎన్జీవోలు, మేధావులమని చెప్పుకునే బృందాలు.. ఇలా ఎవరైనా సరే, నష్టాన్ని అంగీకరించి సర్దుకుపోయేది మాత్రం ప్రతిసారీ హిందువులే. మనం హక్కును సాధించుకున్నాం, కానీ ఆచారాన్ని కోల్పోయాం. ఈ పునరావృత, వ్యవస్థాగత తిరస్కరణ కారణంగా, కేవలం కోర్టు విజయాలు మాత్రమే కాకుండా అంతకుమించి డిమాండ్ చేయాల్సిన సమయం వచ్చింది. భక్తులే తమ దేవాలయాలు, మతపరమైన వ్యవహారాలను చురుకుగా నిర్వహించే 'సనాతన ధర్మ రక్షా బోర్డు' మనకు అవసరం. హిందూ సంప్రదాయాలను, ఆచారాలను అపహాస్యం చేయడం కొన్ని సమూహాలకు పరిపాటిగా మారింది. ఇతర మతాల కార్యక్రమాల విషయంలో వారు అదే ధైర్యం చేయగలరా? హిందువులకు ఆర్టికల్ 25 ప్రాథమిక హక్కు కాకుండా, ఐచ్ఛిక హక్కుగా మారిందా? ఒక పోలీస్ కమిషనర్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ నిర్దిష్ట హైకోర్టు ఆదేశాలను ఏకపక్షంగా రద్దు చేయగలరా? చట్టబద్ధమైన భూమిలో దీపం వెలిగించడం 'హానిచేయని మతపరమైన చర్య' అని హైకోర్టు నిర్ధారించినప్పుడు, ఈ ఆచారం మత సామరస్యానికి ముప్పు అని ఎవరు, ఏ చట్టపరమైన యంత్రాంగం ద్వారా నిర్ణయిస్తారు? హిందూ మత సంస్థల శాఖ అధికారులు నిలకడగా హిందూ భక్తుల ప్రయోజనాలకు, ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? వారెలా జవాబుదారీతనం నుంచి తప్పించుకుంటున్నారు? మతపరమైన సమస్యలు తలెత్తినప్పుడు అబ్రహామిక్ మతాలను (అరేబియా మూలాలున్న మతాలు) అనుసరించేవారిలో ఉన్న ఐక్యతా స్ఫూర్తిని, సంఘీభావాన్ని హిందువులు గమనించాలి. వారు తమ విశ్వాసం కోసం జాతి, ప్రాంతీయ, భాషా భేదాలను అధిగమిస్తారు. హిందువులు కులం, ప్రాంతం, భాషా అడ్డంకులతో విడిపోయి ఉన్నంత కాలం, హిందూ మతం, దాని ఆచారాలపై అపహాస్యాలు, అవమానాలు కొనసాగుతూనే ఉంటాయి. మన దేశంలోని హిందువులు హిందూ ధర్మం (తమిళంలో అరం) స్ఫూర్తితో ఒక ఉమ్మడి కనీస కార్యక్రమం కింద ఏకం కాకపోతే, ఈ స్ఫూర్తి నశించిపోతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుంచి ద్వారక వరకు ఉన్న ప్రతి హిందువు తమ సొంత గడ్డపై హిందువులు ఎదుర్కొంటున్న అవమానాలపై మేల్కొనే రోజు వస్తుందని నేను ఆశిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# చంద్రబాబు నన్ను అభినందించారు

**తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి**

అమరావతి, డిసెంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తనను ఆశీర్వదించడంతో ఎంతో సంతోషం కలిగిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు ఆయన చంద్రబాబును ఆహ్వానించారు. ఇరువురు దాదాపు గంటన్నర సేపు సమావేశమయ్యారు. చంద్రబాబుతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు పాలన బాగుందని కొనియాడారు. తనకు మంచి అరకు కాఫీ ఇచ్చారని, అదే విధంగా వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారని తెలిపారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం పట్ల చంద్రబాబు తనను అభినందించారని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌కు కోమటిరెడ్డి ఒక సూచన చేశారు. జగన్ అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించాలని ఆయన సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ సభకు వెళ్లి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు.

# నరసరావుపేట ప్రభుత్వ వైద్యుడిపై వేటు

నరసరావుపేట, డిసెంబర్ 5 (ఈవార్తలు): విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి. నారాయణ స్వామిని సస్పెండ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. గత నెల 26న నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు డాక్టర్ నారాయణ స్వామి ట్యూబెక్టమీ ఆపరేషన్ నిర్వహించారు. అయితే, ఆపరేషన్ సమయంలో ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించి, సర్జికల్ బ్లేడ్‌ను మహిళ కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ఆ తర్వాత నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, ప్రాథమిక విచారణ నివేదికలో వైద్యుడి నిర్లక్ష్యం స్పష్టంగా రుజువైంది.






# ప్రభుత్వ టీచర్లే బెస్ట్: చంద్రబాబు

పార్వతీపురం జిల్లా, డిసెంబర్ 5 (ఈవార్తలు): ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులపై ఉపాధ్యాయులు ఎక్కువ శ్రద్ధ చూపే అవకాశం ఉందని, ప్రభుత్వ టీచర్లే ఉత్తమమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి మెరుగ్గా ఉందని, ప్రతి 18 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 25 మందికి ఒకరే ఉన్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లా, భామినిలోని ఏపీ మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన "మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0" కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాష్ట్ర విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానించింది, మద్యం షాపుల వద్ద డ్యూటీలు వేసింది. కానీ మా ప్రభుత్వం టీచర్లకు గౌరవం ఇస్తుంది. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులను నియమించాం. పారదర్శకంగా బదిలీలు చేపట్టాం. టీచర్లను గౌరవించే బాధ్యత మాది, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది," అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితిని తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు ఉన్నత, విదేశీ విద్యకు దూరమవ్వకూడదనే లక్ష్యంతో 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు అయ్యే ఖర్చు మొత్తాన్ని పావలా వడ్డీకే రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తమ ఆశయాలను చంపుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే ప్రథమ స్థానం దక్కేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, విద్యాశాఖను సమర్థంగా నిర్వహిస్తున్నారంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను చంద్రబాబు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది జనవరిలో "స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్" నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఏడో తరగతి నుంచే విద్యార్థులను వినూత్నంగా ఆలోచించేలా తీర్చిదిద్దుతామని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వారి ప్రతిభను గుర్తించి పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశం కల్పిస్తామని చెప్పారు. భామిని మోడల్ స్కూల్‌లోని ల్యాబ్స్‌ను పరిశీలించిన ఆయన, 'క్లిక్కర్ టూల్' ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానాన్ని ప్రశంసించారు. 'స్కై, మౌంటెన్, స్టీమ్'గా విద్యార్థులను వర్గీకరించి, వారి బలాబలాలకు అనుగుణంగా బోధన చేయడం మంచి ఫలితాలనిస్తుందన్నారు. చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగానే చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం కోసం 'డొక్కా సీతమ్మ' పథకాన్ని, రాజకీయ రంగులు లేని స్టూడెంట్ కిట్లను అందిస్తున్నామని గుర్తుచేశారు. శనివారం 'నో బ్యాగ్ డే' వంటి కార్యక్రమాలతో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం, మంత్రి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.






# నల్లగొండ నర్సన్న పట్టెనామాలకు 9న వేలం

కొడిమ్యాల, డిసెంబర్ 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానములో పట్టె నామాలు, కోరమీసాలు అమ్ముకొనేందుకు ఈ నెల 9న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఇందుకోసం ఆశావహులు రూ.లక్ష డీడీ తీసి డిపాజిట్ చేయాలని సూచించారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పట్టెనామాలు, కోరమీసాలు అమ్ముకోవచ్చని తెలిపారు. డీడీ సంబంధిత వ్యక్తులే వేలంలో పాల్గొనాలని స్పష్టం చేశారు.

# తిరుమల కొండపై డ్రోన్ కలకలం

**పోలీసుల అదుపులో ఎన్నారై భక్తులు**

తిరుమల, డిసెంబర్ 5 (ఈవార్తలు): తిరుమల పుణ్యక్షేత్రంలో మరోమారు డ్రోన్ కెమెరా కలకలం సృష్టించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే కొండపైకి ఇద్దరు భక్తులు డ్రోన్‌ను తీసుకురావడం, దానిని యథేచ్ఛగా ఎగురవేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటన టీటీడీ భద్రతా వైఫల్యాన్ని మరోసారి ఎత్తిచూపింది. వివరాల్లోకి వెళితే... అర్జున్ దాస్, సులక్షణ దాస్ అనే ఇద్దరు ఎన్నారై భక్తులు తిరుమలకు డ్రోన్ కెమెరాను తీసుకువచ్చారు. అలిపిరి వద్ద ఉండే మూడంచెల భద్రతా తనిఖీ వ్యవస్థను దాటుకుని దీనిని కొండపైకి తీసుకెళ్లడం గమనార్హం. అనంతరం శిలాతోరణం సమీపంలో ఆ భక్తుడు డ్రోన్‌ను గాల్లోకి ఎగురవేశారు. దీనిని గమనించిన స్థానికులు, ఇతర భక్తులు వెంటనే టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న విజిలెన్స్ అధికారులు డ్రోన్‌ను ఎగరేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఇస్కాన్‌కు చెందిన ఎన్నారైలుగా గుర్తించారు. డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకుని, అందులో రికార్డయిన దృశ్యాలను పరిశీలిస్తున్నారు. అనంతరం నిందితులను విచారణ నిమిత్తం పోలీసులకు అప్పగించారు. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎలాంటి వస్తువులు, విమానాలు ఎగరడంపై పూర్తి నిషేధం ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా కూడా తిరుమలలో డ్రోన్లపై నిషేధం విధించారు. అయినప్పటికీ గతంలోనూ ఇలాంటి ఘటనలు పలుమార్లు జరిగాయి. పటిష్ఠమైన భద్రత ఉందని చెబుతున్నప్పటికీ, డ్రోన్లు, మొబైల్ ఫోన్లు ఆలయం వద్దకు చేరుతుండటంపై భక్తుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా టీటీడీ కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పవన్‌తో సినిమా ఛాన్స్.. కానీ!

**అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చా.. మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు**

చిలకలూరిపేట, డిసెంబర్ 5 (ఈవార్తలు): చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనతో ఒక సినిమా కూడా తీయాలని భావించానని మనసులో మాట బయటపెట్టారు. అయితే, అనుకోకుండా రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. "నేను పవన్ అభిమానిని. ఆయనతో సినిమా తీయాలని అనుకున్నాను, అడిగిన వెంటనే అవకాశం కూడా లభించింది... అడిగిన వెంటనే ఒప్పుకున్నారు... కానీ ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చేశాను" అని తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పుల్లారావు స్పష్టం చేశారు. ఐఏఎస్ అధికారి కృష్ణతేజ చిలకలూరిపేటలో ప్రభుత్వానికి కోట్ల రూపాయల విలువైన స్థలాలను విరాళంగా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాల ద్వారా పిల్లల చదువుపై మరింత అవగాహన పెంచుకోవచ్చని ప్రత్తిపాటి సూచించారు.

# ఇంత పక్షపాతమా?

**రాజుగారికి ఒక న్యాయం, రెడ్డిగారికి మరో న్యాయమా?**

**ఆలయాల్లో దొంగతనాలపై ప్రభుత్వానిది పక్షపాత వైఖరి: శ్యామల**

తాడేపల్లి, డిసెంబర్ 5 (ఈవార్తలు): ఆలయాలకు సంబంధించిన వ్యవహారాల్లో ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విమర్శించారు. "రాజు గారికి ఒక న్యాయం, రెడ్డి గారికి మరొక న్యాయమా?" అంటూ ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తిరుమల, సింహాచలం దేవస్థానాల్లో జరిగిన దొంగతనాల విషయంలో ప్రభుత్వం రెండు రకాలుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల పరకామణిలో రూ.72 వేల విలువైన డాలర్లు దొంగతనం జరిగితే, నిందితుడి నుంచి న్యాయమూర్తుల సలహా మేరకు రూ.14 కోట్ల విలువైన ఆస్తిని టీటీడీ పేరిట రాయించారని శ్యామల పేర్కొన్నారు. కానీ గత టీటీడీ చైర్మన్లుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో, సింహాచలం దేవస్థానం హుండీలో రూ.55 వేలు దొంగతనం జరిగితే దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజును అందలం ఎక్కిస్తున్నారని విమర్శించారు. ఆ దొంగతనం చేసిన వ్యక్తి నుంచి ఏమైనా రికవరీ చేశారా..? దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని మండిపడ్డారు. ఇదే క్రమంలో బీఆర్ నాయుడు (టీటీడీ చైర్మన్) తిరుమల ఏడు కొండలు కాదని, ఎనిమిది కొండలని అంటున్నారు...

## తెలుగు అయ్యప్ప భక్తుడిపై దాడి.. ఉద్రిక్తత

పళని: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం పళనిలో దారుణం చోటుచేసుకుంది. శబరిమల యాత్రలో భాగంగా సుబ్రమణ్య స్వామి దర్శనానికి వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ అయ్యప్ప భక్తుడిపై స్థానిక దుకాణదారుడు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీకి చెందిన అయ్యప్ప స్వాముల బృందం శబరిమల యాత్రలో భాగంగా పళని క్షేత్రానికి చేరుకుంది. వారిలో ఒక భక్తుడు సమీపంలోని దుకాణానికి వెళ్లి వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్ కొనుగోలు చేయబోయారు. వాటిపై గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) రూ.30 ఉండగా, దుకాణదారుడు రూ.40 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని భక్తుడు ప్రశ్నించడంతో, వ్యాపారి తమిళంలో దూషిస్తూ మాటామాటా పెంచాడు. ఆవేశంతో ఊగిపోయిన అతను, గాజు సీసాతో భక్తుడి తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో భక్తుడికి తీవ్ర రక్తగాయమైంది. అంతటితో ఆగకుండా, దుండగుడు బాధితుడి మెడలోని పవిత్రమైన అయ్యప్ప దీక్షా మాలను సైతం తెంచివేశాడు. ఈ విషయం తెలియగానే సమీపంలో ఉన్న తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దాడి చేసిన వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. అయితే, స్థానికులు వ్యాపారికి మద్దతుగా నిలవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. భక్తులు రాస్తారోకో నిర్వహించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసే వరకు ఆందోళన విరమించేది లేదని భక్తులు స్పష్టం చేశారు.

## అరిస్తే ఏం ప్రయోజనం

**ప్రజాసమస్యలపై పోరాడాలి.. సొంత పార్టీకి శశిథరూర్ చురక**


న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో తాను ఒంటరిని కావొచ్చని, కానీ ప్రజలు మాత్రం వారి తరఫున ప్రాతినిధ్యం వహించడానికి, సమస్యలను లేవనెత్తడానికి తనను పార్లమెంటుకు పంపించారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ అన్నారు. గత కొన్ని రోజులుగా ఆయన సొంత పార్టీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ, అధికార బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతున్నారు. దీనితో ఆయనపై కాంగ్రెస్ పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉండాలనుకుంటే పార్టీలో నుంచి వెళ్లిపోవచ్చని కూడా కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ, శశిథరూర్ మరోసారి పార్లమెంటులో కాంగ్రెస్ సహా విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళనలు లేవనెత్తుతుండటంతో పార్లమెంటు సమావేశాల్లో అంతరాయాలు నెలకొంటున్నాయి. ఈ అంశంపై ఆయన స్పందించారు. సమస్యలను పార్లమెంటులో చర్చించడానికి గందరగోళం సృష్టించాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఇక్కడ దేశం కోసం, ప్రజల కోసం మాట్లాడాలి తప్ప, అరిచి గందరగోళం సృష్టించడం సరికాదని అన్నారు. తాను మొదటి నుంచి ఇదే విషయం చెబుతున్నానని, సోనియా గాంధీ సహా తన పార్టీ నాయకులకు ఈ విషయం తెలుసని ఆయన అన్నారు. తనను ప్రజలు ఎన్నుకున్నది తమ కోసం, దేశం కోసమని, తన తెలివితేటలు ఉపయోగించి మాట్లాడాలనే ఉద్దేశంతో ఇక్కడకు పంపించారని పేర్కొన్నారు.

## ఆరేళ్ల వయసులో గదిలోకి..
## 26 ఏళ్లకు బయటకు!

**వెలుగు చూసి కళ్లు కోల్పోయిన యువతి**

బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో అత్యంత హృదయవిదారకమైన ఘటన వెలుగులోకి వచ్చింది. భద్రత పేరుతో ఓ తండ్రి తన కూతురిని ఏకంగా 20 ఏళ్ల పాటు చీకటి గదిలో బంధించాడు. ఇటీవల అధికారులు ఆమెను రక్షించి బయటకు తీసుకురాగా, సుదీర్ఘకాలం వెలుగు చూడకపోవడంతో ఆమె తన కంటిచూపును దాదాపు పూర్తిగా కోల్పోయింది. వివరాల్లోకి వెళితే.. బకావండ్ గ్రామానికి చెందిన లీసా అనే యువతికి ఆరేళ్ల వయసులో ఈ నరకం మొదలైంది. 2000 సంవత్సరంలో ఆమె రెండో తరగతి చదువుతున్నప్పుడు, గ్రామస్థుడు ఒకరు ఆమెను చంపేస్తానని బెదిరించాడు. ఆ బెదిరింపుతో తీవ్ర భయాందోళనకు గురైన లీసా, బయటకు రావాలంటేనే జంకేది. భార్యను కోల్పోయి, ఒంటరివాడైన ఆమె తండ్రి.. తన కూతురిని ఎలా కాపాడుకోవాలో తెలియక, ఆమెను ఇంట్లోని ఓ కిటికీలు లేని గదిలో బంధించాడు. గత 20 ఏళ్లుగా ఆ చీకటి గదే ఆమె ప్రపంచమైంది. ఆహారం అందించడానికి మాత్రమే ఆ గది తలుపు తెరుచుకునేది. ఇటీవల అధికారులు ఆమెను రక్షించే సమయానికి, ఆమె మనుషులను చూసి భయపడటం, కనీసం తన పేరుకు కూడా స్పందించలేని స్థితిలో ఉంది. సుదీర్ఘకాలం కాంతికి దూరంగా ఉండటంతో ఆమె కంటిచూపు తిరిగి వచ్చే అవకాశాలు చాలా తక్కువని వైద్యులు తెలిపారు. మానసికంగా కూడా ఆమె ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం లీసాను 'ఘరౌందా ఆశ్రమం'లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. "మాకు సమాచారం అందగానే ఆమెను రక్షించాం. ఆమె ఇప్పుడు సురక్షితంగా ఉంది. మొదట్లో మనుషులను చూసి భయపడేది. ఇప్పుడు నెమ్మదిగా మాట్లాడుతోంది" అని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుచిత్రా లక్రా తెలిపారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం విచారణకు ఆదేశించింది. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

## అనిల్ అంబానీ 1,120 కోట్ల ఆస్తుల అటాచ్




ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. యస్ బ్యాంక్ మనీలాండరింగ్ కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ, ఈరోజు రిలయన్స్ గ్రూప్‌కు చెందిన రూ.1,120 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ లలో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ జప్తు చేసిన ఆస్తులలో స్థిరాస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు, అన్‌కోటెడ్ ఇన్వెస్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ తాజా అటాచ్‌మెంట్‌తో ఈ కేసులో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ.9,000 కోట్లకు చేరింది. అక్టోబర్ నుంచి ఇప్పటివరకు రూ.7,800 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ సహా పలు గ్రూప్ కంపెనీలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ముంబై, ఢిల్లీ, పుణె, చెన్నై వంటి నగరాల్లోని నివాస, వాణిజ్య భవనాలు, భూములు ఇందులో ఉన్నాయి. ఆర్‌హెచ్ఎఫ్ఎల్, ఆర్‌సీఎఫ్ఎల్ కంపెనీలు సేకరించిన ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారన్న సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. 2017-19 మధ్య యస్ బ్యాంక్ ఈ రెండు సంస్థలలో వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. అయితే, సెబీ నిబంధనలకు విరుద్ధంగా, తిరిగి ఈ నిధులను అంబానీ గ్రూప్ కంపెనీలకే మళ్లించి పాత అప్పులు తీర్చేందుకు (ఎవర్‌గ్రీనింగ్) వాడారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ తాజా పరిణామాలపై అనిల్ అంబానీ గ్రూప్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## 30కి పైగా దేశాలపై యూఎస్ ట్రావెల్ బ్యాన్!

వాషింగ్టన్: అమెరికా తన ప్రయాణ ఆంక్షల పరిధిని భారీగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 19 దేశాలపై ఉన్న ఈ నిషేధాన్ని 30కి పైగా దేశాలకు పెంచాలని యోచిస్తున్నట్లు యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ ఆమె ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నిషేధిత దేశాల సంఖ్యపై కచ్చితమైన అంకె చెప్పనప్పటికీ, ఆ సంఖ్య 30కి పైగానే ఉంటుందని తెలిపారు. "కొన్ని దేశాల ప్రభుత్వాలు తమ పౌరుల గుర్తింపును ధ్రువీకరించలేని పరిస్థితుల్లో ఉన్నాయి.

# ఈఎంఐలు కట్టేవాళ్లు 28.3 కోట్ల మంది

**ఏడేళ్లలో రెండున్నరింతలు పెరుగుదల.. లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలో ఈఎంఐలు లేదా ఏదో ఒక రకం రుణం కింద వాయిదాలు (ఈఎంఐ) చెల్లిస్తున్న వారి సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా 28.3 కోట్లు. అంటే, దేశంలోని ప్రతి ఐదుగురిలో దాదాపు ఒకరు అప్పుల ఊబిలో ఉన్నారన్న మాట. తమ ఆకాంక్షలు నెరవేర్చుకోవడానికి, పెరుగుతున్న ఖర్చులను బట్టి చూస్తే భారతీయులు పెద్ద ఎత్తున రుణాలపై ఆధారపడుతున్నారని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడేళ్లలో అప్పులు తీరుస్తున్న వారి సంఖ్య రెట్టింపునకు పైగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కీలక వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఆయన అందించిన సమాచారం ప్రకారం, 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అప్పులు చెల్లిస్తున్న వారి సంఖ్య 12.8 కోట్లుగా ఉండగా, 2024-25 నాటికి అది 28.3 కోట్లకు చేరింది. ఒక వ్యక్తి ఎన్ని రుణాలు తీసుకున్నా, అతన్ని ఒక్కరిగానే పరిగణించి ఈ లెక్కలు రూపొందించారు. అంటే, ప్రస్తుతం దేశంలో 28.3 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక బ్యాంకుకో, ఆర్థిక సంస్థకో వాయిదాలు చెల్లిస్తున్నారు. మరోవైపు, కుటుంబాల ఆర్థిక బాధ్యతల విలువ కూడా అసాధారణ స్థాయిలో పెరిగింది. 2015 ఆర్థిక సంవత్సరంలో రూ. 3.8 లక్షల కోట్లుగా ఉన్న ఈ భారం, 2024 నాటికి ఏకంగా రూ. 18.8 లక్షల కోట్లకు చేరింది. అయితే, 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది కొంత తగ్గి రూ. 15.7 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా. దేశ జీడీపీతో పోల్చినా ఈ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. 2015లో జీడీపీలో కుటుంబ రుణాల వాటా కేవలం 3 శాతంగా ఉండగా, 2024 నాటికి అది 6.2 శాతానికి పెరిగింది. 2025లో 4.7 శాతానికి తగ్గొచ్చని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో ఒక్కో రుణగ్రహీతపై సగటు అప్పు కూడా గణనీయంగా పెరిగింది. 2018లో సగటున ఒక్కొక్కరిపై రూ. 3.4 లక్షల అప్పు ఉండగా, 2025 నాటికి అది రూ. 4.8 లక్షలకు పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ, కుటుంబ రుణాలు వినియోగాన్ని పెంచి వృద్ధికి దోహదపడతాయని నిపుణులు అంటున్నారు. అయితే, ఇదే సమయంలో ప్రజల ఆదాయం అప్పులకు తగ్గట్టుగా పెరగకపోతే, ఇది ఆర్థిక వ్యవస్థకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అప్పుల వృద్ధి, ఆదాయ వృద్ధి మధ్య సమతుల్యం లోపిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని వారు అభిప్రాయపడుతున్నారు.




# భారత్-రష్యా ఒప్పందాల్లో కొత్త చరిత్ర



న్యూఢిల్లీ: భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక బంధం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం కీలక ఒప్పందాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 2030 వరకు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఉద్దేశించిన ఒక సమగ్ర ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరువురు నేతలు ఆమోదం తెలిపారు. ఈ చారిత్రక భేటీ అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2025 నాటికి పరస్పర పెట్టుబడులను 50 బిలియన్ డాలర్లకు, 2030 నాటికి వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా యురేషియన్ ఎకనామిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక, భారత్-రష్యా మధ్య వాణిజ్య సంబంధాలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఇంధనం నుంచి ఎరువుల వరకు..**

ఈ సమావేశంలో ఇరు దేశాల నేతల సమక్షంలో పలు కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా, అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు పుతిన్ హామీ ఇచ్చారు. ఇది భారతదేశ ఇంధన భద్రతకు ఎంతో కీలకమైన భరోసా. అదేవిధంగా, ఎరువుల రంగంలో ఒక పెద్ద ముందడుగు పడింది. రష్యాకు చెందిన ప్రముఖ సంస్థ 'యురాల్‌కెమ్'తో భారతీయ కంపెనీలు కలిసి రష్యాలో ఒక యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది ద్వైపాక్షిక పారిశ్రామిక సహకారంలో ఒక ముఖ్యమైన పరిణామం. దీనివల్ల భారత రైతాంగానికి ఎరువుల సరఫరా మెరుగుపడనుంది. వీటితో పాటు ఆహార భద్రత, నౌకాయాన శిక్షణ, వైద్య శాస్త్రాలు, వినియోగదారుల రక్షణ, పోర్టులు, షిప్పింగ్ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు కూడా ఒప్పందాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రష్యాకు చెందిన వినియోగదారుల రక్షణ సంస్థ మధ్య కుదిరిన ఒప్పందం ఇరు దేశాల మధ్య ఆహార ఉత్పత్తుల వాణిజ్యానికి మరింత ఊతమిస్తుంది.

# విమానాల వ్యవహారం కొలిక్కి




న్యూఢిల్లీ: గత రెండు రోజులుగా రద్దయిన విమాన సర్వీసులు క్లియర్ అయ్యాయని, శనివారం నుంచి విమానాశ్రయాల్లో సాధారణ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. విమానాల రద్దు వ్యవహారం క్రమంగా కొలిక్కి వస్తోందని ఆయన అన్నారు. రద్దీ లేదా వేచి ఉండే పరిస్థితి ఉండదని ఆశిస్తున్నట్లు చెప్పారు. వెంటనే మొదలు పెట్టగలిగే అన్ని కార్యకలాపాలను ప్రారంభించాలని ఇండిగోను ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితి నుంచి సాధారణ స్థితికి తీసుకురావడమే తమ తక్షణ కర్తవ్యమని ఆయన వెల్లడించారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలు, షెడ్యూలింగ్ నెట్ వర్క్‌ను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. అన్ని విమానయాన సంస్థలు నిబంధనలు సరిగా పాటిస్తున్నాయో లేదో నిర్ధారిస్తామని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడ, ఎలా తప్పు జరిగిందో తెలుసుకోవడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. బాధ్యులైన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పిల్లలు, వృద్ధులు, పాలిచ్చే తల్లులు, వికలాంగులకు విమానయానంలో ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్ ఆపరేటర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

### 15 నాటికి సాధారణస్థితికి ఇండిగో: సీఈవో

న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా విమానాల రద్దు, ఆలస్యంతో ఇండిగో విమానయాన సంస్థ సేవలు అస్తవ్యస్తంగా మారిన సంగతి తెలిసిందే. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలోని పలు విమానాశ్రయాల్లో ఇండిగో విమానాలు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ ప్రయాణికులు ఇండిగో సిబ్బందిని నిలదీస్తున్నారు. ఈ పరిస్థితిపై ఇండిగో ఎయిర్ లైన్స్ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందించారు. డిసెంబర్ 10 నుంచి 15వ తేదీ నాటికి విమాన సర్వీసులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుంటాయని ప్రకటించారు. శనివారం నాటికి రద్దయ్యే విమానాల సంఖ్య 1,000 కంటే తక్కువగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నెలకొన్న ప్రతికూల వాతావరణ




పరిస్థితులు, ఇతర కారణాల వల్ల విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఇండిగో నెట్‌వర్క్‌లో 30 శాతానికి పైగా విమానాలు ప్రభావితమయ్యాయి. దీంతో వేలాది విమానాలను రద్దు చేయాల్సి రాగా, లక్షలాది మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరడంలో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పీటర్ ఎల్బర్స్ మాట్లాడుతూ, "ఈ సవాళ్లను అధిగమించడానికి మా బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. షెడ్యూళ్లను మెరుగుపరుస్తున్నాం. రోజురోజుకు పరిస్థితి మెరుగవుతోంది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మేం క్షమాపణలు కోరుతున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం కొత్త షెడ్యూలింగ్, అదనపు వనరులతో సేవలను పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కూడా పర్యవేక్షిస్తోంది. ప్రయాణికులు తమ విమాన ప్రయాణ వివరాల కోసం ఎప్పటికప్పుడు ఇండిగో అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను చూసుకోవాలని సంస్థ సూచించింది. కాగా, ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో, ఇతర ఎయిర్ లైన్స్ సేవలు విపరీతంగా రేట్లు పెంచేసినట్టు తెలుస్తోంది. సాధారణంగా కొన్ని దేశీయ రూట్లలో రూ.33 వేలు ఉండే టికెట్ ధర ఇప్పుడు రూ.93 వేలకు చేరింది.



## ఆన్‌లైన్‌లో టెక్కీ జంట రిసెప్షన్

**విమాన సర్వీసులు రద్దు ఎఫెక్ట్.. వర్చువల్‌గా ఆశీర్వదించిన అతిథులు**

బెంగళూరు: హుబ్లీ-భువనేశ్వర్ మధ్య ఇండిగో విమాన సర్వీసులు రద్దు కావడంతో ఓ టెక్కీ జంట ఆన్‌లైన్‌లోనే రిసెప్షన్ జరుపుకుంది. ఇండిగో విమాన సర్వీసులు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఓ టెక్కీ దంపతులకు మాత్రం ఊహించని అనుభవం ఎదురైంది. ఇటీవల వివాహం చేసుకున్న ఈ నూతన దంపతులు అనివార్య కారణాల వల్ల ఆన్‌లైన్‌లో రిసెప్షన్ నిర్వహించాల్సి వచ్చింది. కర్ణాటకలోని హుబ్లీకి చెందిన మేధా క్షీరసాగర్, ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన సంగమ్ దాస్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. నవంబర్ 23న వీరి వివాహం జరగగా, బుధవారం వధువు స్వస్థలంలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరయ్యేందుకు నూతన దంపతులు భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు ఇండిగో విమానంలో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే, విమాన సర్వీసుల్లో అంతరాయం ఏర్పడటంతో వారి రాక సాధ్యం కాలేదు.



## పాన్ మసాలాపై కొత్త సెస్సు

**బిల్లుకు లోక్ సభ ఆమోదం**

న్యూఢిల్లీ: పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధిస్తూ, తద్వారా వచ్చే నిధులను జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వినియోగించాలని ప్రతిపాదించే 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు-2025'ను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. పాన్ మసాలా కంపెనీలపై సెస్సును ప్రతిపాదిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, సెస్సు ద్వారా వచ్చే నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు వర్తిస్తుంది. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీ గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సెస్సు వల్ల జీఎస్టీ రాబడిపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధిస్తామని పేర్కొన్నారు. 2010-14 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గినట్లు ఆమె వెల్లడించారు.

## పాన్ మసాలా హీరోలకు అవార్డులొద్దు!

**లోక్‌సభలో ఎంపీ హనుమాన్ బెనివాల్ ఫైర్**

న్యూఢిల్లీ: పాన్ మసాలా, గుట్కా వంటి హానికరమైన ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్న సినీ నటుల జాతీయ అవార్డులను వెనక్కి తీసుకోవాలని జాతీయ ప్రజాస్వామ్య పార్టీ అధ్యక్షుడు, రాజస్థాన్ లోని నాగౌర్ ఎంపీ హనుమాన్ బెనివాల్ డిమాండ్ చేశారు. లోక్‌సభలో 'జాతీయ భద్రత, ప్రజారోగ్య సెస్ బిల్లు'పై జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే పాన్ మసాలాను షారుఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, సల్మాన్ ఖాన్ వంటి ప్రముఖ నటులు ప్రచారం చేస్తున్నారని బెనివాల్ ఆరోపించారు. "జాతీయ అవార్డులు పొందిన ఏ వ్యక్తి కూడా ఇలాంటి హానికరమైన ఉత్పత్తులను ప్రమోట్ చేయకూడదు. ఒకవేళ వారికి అవార్డులు ఇచ్చి ఉంటే, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన అన్నారు. ఈ నటులపై తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులు రాజస్థాన్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌తో పాటు జైపూర్, జోధ్‌పూర్ కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. దేశంలో గుట్కా, పాన్ మసాలా వినియోగం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో వీటి వాడకం విచ్చలవిడిగా సాగుతోందని విమర్శించారు. రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కొందరు అధికారుల అండతో అక్రమ గుట్కా ఫ్యాక్టరీలు నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. అనంతరం, రూల్ 377 కింద ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ అంశాన్ని కూడా బెనివాల్ లేవనెత్తారు.

## కల్యాణి చిత్రం





## కండలు పెంచేస్తున్న ప్రగతి



ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ప్రగతి.. సినిమాల్లో పద్ధతిగా కనిపిస్తుంది. కానీ పవర్ లిఫ్టింగ్‌లోనూ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. నేషనల్ స్థాయిలో కూడా ఎన్నో మెడల్స్ గెలుచుకొంది. ఈ సంవత్సరం జరిగిన తెలంగాణ స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి అందరితో శభాష్ అనిపించుకుంది. అలాగే కేరళలో జరిగిన నేషనల్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో కూడా పాల్గొని మరో గోల్డ్ మెడల్ గెల్చుకుంది. టర్కీలో జరగబోయే ఏషియన్ గేమ్స్‌లో పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొనబోతోంది. ఈ నేపథ్యంలో ఏషియన్ గేమ్స్ లో కూడా ప్రగతి గోల్డ్ మెడల్ సాధించి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## క్రిస్మస్ రేసులో బాలయ్య?



నందమూరి అభిమానులు ప్రస్తుతం గందరగోళంలో ఉన్నారు. గురువారం రాత్రి జరగాల్సిన ప్రీమియర్స్ ఆగిపోవడం, ఆ వెంటనే సినిమా వాయిదా పడటం వారికి మింగుడుపడని విషయం. థియేటర్ల వరకు వచ్చి వెనుతిరిగిన ఫ్యాన్స్, అసలు సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, 'అఖండ 2: తాండవం' చిత్రాన్ని డిసెంబర్ 25న విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. క్రిస్మస్ సెలవులు కలిసి వస్తాయి కాబట్టి, ఆ డేట్ అయితేనే సేఫ్ అని భావిస్తున్నారట. అప్పటికి అన్ని లీగల్ ఇష్యూస్ క్లియర్ చేసుకుని, గ్రాండ్ గా రిలీజ్ చేయాలనేది మేకర్స్ ప్లాన్. క్రిస్మస్ బరిలో బాలయ్య దిగితే బాక్సాఫీస్ షేక్ అవ్వడం ఖాయం. ఇప్పటికే డిసెంబర్ 25న చాంపియన్, శంభాల, పతంగ్ లాంటి సినిమాలు రిలీజ్ కు రెడీగా ఉన్నాయి. ఇప్పుడు బాలయ్య ఎంట్రీ ఇస్తే పోటీలో మార్పులు రావచ్చు. మాస్ సినిమాకు పండగ సీజన్ తోడైతే కలెక్షన్స్ ఏ రేంజ్ లో ఉంటాయో మనకు తెలిసిందే. ఈ డేట్ ఫిక్స్ అయితే మాత్రం ఫ్యాన్స్ కు క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అన్నీ ఒకేసారి వచ్చినట్లే భావించాలి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## రకుల్ అదిరేటి డ్రెస్సు!

అరకొర సినిమా అవకాశాలతో ఉన్న రకుల్ ప్రీత్ సింగ్ సమయం దొరికినప్పుడు తన ట్రెండీ అవుట్‌ఫిట్‌తో హల్చల్ చేస్తోంది. తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో తన అందంతో అందరిని అట్రాక్ట్ చేసింది. తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో పాల్గొన్న రకుల్ ప్రీత్ సింగ్ తన డ్రెస్సింగ్ స్టైల్‌తో అక్కడున్నవారిని కట్టిపడేసింది. ఫుల్ లెన్త్ ఫ్రాక్ ధరించిన రకుల్ ప్రీత్ సింగ్.. ఓ అవార్డు అందుకోవడం కోసం వెళ్ళినట్టు సమాచారం. అజయ్ దేవగన్ హీరోగా వచ్చిన దేదే ప్యార్ దే -2 సినిమాలో హీరోయిన్ గా నటించిన సంగతి మనకు తెలిసిందే. ఈ సినిమాలో ఆయేషా అనే పాత్రలో రకుల్ నటించింది.అయితే ఈ సినిమాలో నటించినందుకు గానూ తనకు మొట్టమొదటి అవార్డు వచ్చిందని రకుల్ తన సోషల్ మీడియా ఖాతాలో ఈ విషయాన్ని షేర్ చేసుకుంది. అవార్డ్ ఫంక్షన్ కి వెళ్లిన ఫోటోలను షేర్ చేయడమే కాకుండా దేదే ప్యార్ దే -2 సినిమాలోని ఆయేషాకి మొదటి అవార్డు వచ్చింది. ప్రధాన పాత్రలో ఈ సంవత్సరం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చినందుకు.. ఈ అవార్డు వచ్చిందని థాంక్స్ చెప్తూ లవ్ సింబల్ ని పెట్టి క్యాప్షన్ లో రాసుకువచ్చింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## సమంత బ్యాక్ టు వర్క్



టాలీవుడ్ తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న హీరోయిన్ సమంత గత కొన్ని రోజులుగా వ్యక్తిగత విషయాల కారణంగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఆమె నటించిన సినిమాలేవి ఈమధ్య కాలంలో విడుదల కాలేదు. దాంతో సినిమాల గురించి ఆమె వార్తలు నిలవలేదు. ఆమె ప్రేమ వ్యవహారం ఇంకా ఇతర విషయాల గురించి మాత్రమే వార్తలు నిలుస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఆమె ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం ద్వారా తన ప్రేమ కథను సుఖాంతం చేసుకుంది. రెండోసారి వివాహం చేసుకున్న సమంత పెళ్లి ఫోటోల్లో చాలా సంతోషంగా కనిపిస్తోంది అంటూ అభిమానులు సోషల్ మీడియా వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో సమంతను ఇంత సంతోషంగా చూడలేదంటూ వారు ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమంత ఇక వర్క్ పై దృష్టి పెడుతుందని అంతా భావించారు.. అన్నట్లుగానే సమంత తన తదుపరి సినిమా పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సమంత కొన్ని నెలల క్రితం తన సొంత నిర్మాణ సంస్థ లో మా ఇంటి బంగారం అనే సినిమాను ప్రకటించింది. ఈ సినిమా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ వచ్చే సంవత్సరం ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సమంత సొంత నిర్మాణ సంస్థలో ఈ ఏడాది శుభం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాను నిర్మించడం మాత్రమే కాకుండా చిన్న గెస్ట్ రోల్ చేయడం ద్వారా ప్రేక్షకులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మా ఇంటి బంగారం సినిమాతో చాలా సర్ప్రైజ్ లను ప్లాన్ చేస్తుంది అంటూ ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

## అది నా అదృష్టం



భారతదేశం గురించి వివరించే అవకాశం దక్కడం తన అదృష్టం అని ఐశ్వర్యరాయ్ తెలిపింది. '1994లో అనుకోకుండా ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొన్నాను. అయితే కచ్చితంగా టైటిల్ నాకే రావాలని అనుకోలేదు. అంతర్జాతీయ పోటీలో భారత్ కి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అదృష్టంగా భావించే నేను ఆ పోటీలలో పాల్గొన్నాను. అయితే ఆ సమయంలో భారతీయుల గురించి ప్రపంచ దేశాలలో ఉన్న చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు అనే విషయం నన్ను మరింతగా ఆశ్చర్యపరిచింది. అందుకే ఎలాగైనా సరే మన దేశం విలువను ప్రపంచ దేశాలకు తెలియజేసేలా ఈ సందర్భాన్ని వేదికగా చేసుకొని మన దేశం గురించి గొప్పగా చెప్పగలిగాను. అలా మన దేశం గురించి వివరించే అవకాశం నాకే దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటూ ఐశ్వర్యారాయ్ చెప్పుకొచ్చింది. మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకోవడంపై కూడా స్పందిస్తూ.. "ప్రపంచ సుందరిగా టైటిల్ గెలవడంతో నా జీవితం పూర్తిగా మారిపోయింది. అలా ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఇరువర్ అనే సినిమాలో అవకాశం లభించింది. అదే సంవత్సరం బాలీవుడ్ నుంచి కూడా వరుస ఆఫర్లు తలుపు తట్టాయి. ముఖ్యంగా దేవదాస్ సినిమా నా జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఈ సినిమా తర్వాతే కథల ఎంపిక విషయంలో అవగాహన వచ్చి ప్రతి చిత్రాన్ని చాలా జాగ్రత్తగా ఎంచుకున్నాను. ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నాను.. మీ అందరికీ తెలుసు" అని పేర్కొంది.

## అతనికి 'యస్' చెప్పాను



బిగ్ బాస్ బ్యూటీ పునర్నవి భూపాలం సడెన్‌గా ఒక గుడ్ న్యూస్‌తో ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేసింది. 'నేను అతనికి యస్ చెప్పాను' అంటూ తన కాబోయే భర్తతో దిగిన రొమాంటిక్ ఫోటోలను పోస్ట్ చేసింది. లండన్ లో ఉన్న ఆమె అక్కడే ఈ విషయాన్ని అఫీషియల్ చేసింది. ఆమె ఎంగేజ్మెంట్ చేసుకున్న వ్యక్తి పేరు హేమంత్ వర్మ. అయితే ఇక్కడో ట్విస్ట్ ఏంటంటే.. మొదట ప్రపోజ్ చేసింది పునర్నవినే అట. ఈ విషయాన్ని ఆమె స్వయంగా క్యాప్షన్ లో వెల్లడించింది. 'నేను అతనికి యస్ చెప్పాను, అది కూడా ఎక్కువగా అతని కోసమే కావచ్చు, లేదా కాశ్మీర్ చలి నుంచి తప్పించుకోవడానికి కావచ్చు' అంటూ ఫన్నీగా రాసుకొచ్చింది.




# ఆసీస్ పైచేయి

## రెండో రోజు 44 పరుగుల ఆధిక్యం.. వన్డే తరహాలో దూకుడు బ్యాటింగ్

యాషెస్ సిరీస్.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 73 ఓవర్లలో 6 వికెట్లకు 378 పరుగులు చేసింది. జేక్ వెదరాల్డ్(78 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 72), మార్నస్ లబుషేన్(78 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 65), స్టీవ్ స్మిత్(85 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించాడు. ట్రావిస్ హెడ్(43 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), కామెరూన్ గ్రీన్(57 బంతుల్లో 7 ఫోర్లతో 45) మరోసారి దూకుడుగా ఆడాడు. అలెక్స్ క్యారీ(45 బంతుల్లో 5 ఫోర్లతో 46 బ్యాటింగ్)తో పాటు మైఖేల్ నేజర్(15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/113) మూడు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(2/93) రెండు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ తీసాడు. ప్రస్తుతం ఆసీస్ 44 పరుగుల ఆధిక్యంలో ఉంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ దూకుడుగా ఆడింది. 5.17 రన్‌రేట్‌తో వేగంగా పరుగులు రాబట్టింది. మూడో రోజు ఆటలో తొలి సెషన్ మొత్తం ఆడినా ఆసీస్ ఆధిక్యం 150 పరుగులకు చేరుతుంది. అప్పుడు మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది. తొలి టెస్ట్‌లో ఆసీస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు 325/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 9 పరుగులు మాత్రమే జోడించింది. జోఫ్రా ఆర్చర్‌ను బ్రెండన్ డగ్గెట్ ఔట్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. జోరూట్(206 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. జాక్ క్రాలీ(76) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/75) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నేజర్, స్కాట్ బోలాండ్, బ్రెండన్ డగ్గెట్ తలో వికెట్ తీసారు.






# ఉంటదా..పోతదా!

## నేడే చివరి వన్డే.. వైజాగ్ వేదికగా సమరం

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా ఆఖరి సమరానికి సిద్ధమైంది. శనివారం సాగర తీరం విశాఖపట్నం వేదికగా జరిగే డిసైడర్ మ్యాచ్‌లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. రాంచీలో గెలిచి రాయ్‌పూర్‌లో ఓడిన భారత్.. వైజాగ్‌లో మళ్లీ విజయఢంకా మోగించాలని భావిస్తోంది. రెండో వన్డేలో 358 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయిన భారత్.. తప్పిదాలపై ఫోకస్ పెట్టింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి వన్డేలో తృటిలో చేజారిన విజయాన్ని రెండో వన్డేలో సౌతాఫ్రికా అందిపుచ్చుకుంది. ప్రణాళికపరంగా ఆడి సిరీస్ రేసులో నిలిచింది. ఆఖరి వన్డేలోనూ సమష్టి ప్రదర్శనతో విజయం సాధించి టీమిండియాకు మరో పీడకలను మిగల్చాలనే పట్టుదలతో సఫారీ టీమ్ ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. ఆఖరి వన్డేలోనూ టీమిండియా తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ అందుకున్నాడు. అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. దాంతో రిషభ్ పంత్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాలను యశస్వి జైస్వాల్ అందిపుచ్చుకోలేకపోయాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అయితే మూడో వన్డేలో అతనికి ఆఖరి అవకాశం దక్కనుంది. ఒకవేళ జైస్వాల్‌ను తప్పించాలనుకుంటే రుతురాజ్ గైక్వాడ్‌ను ఓపెనర్‌గా ఆడించాల్సి ఉంటుంది. ఆ సాహసం గంభీర్ చేయకపోవచ్చు. ఇప్పటికే బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన ప్రయోగాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**భారత వన్డే టీమ్:** రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్(కెప్టెన్/కీపర్), రిషభ్ పంత్(కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.



# కేఎల్ నిస్వార్థపరుడు

టీమిండియా తాత్కాలిక వన్డే కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై సౌతాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత జట్టులోనే అతను నిస్వార్థపరుడని, జట్టు అవసరాల కోసం ఆడుతాడని తెలిపాడు. వ్యక్తిగత కెరీర్ కోసం కాకుండా జట్టు కోసం ఆడుతాడని కొనియాడాడు. వన్డేల్లో రాహుల్ టాప్-3లో ఆడితే కచ్చితంగా సెంచరీ చేస్తాడని, కానీ అతను జట్టు అవసరాల కోసం మిడిలార్డర్‌లో ఆడుతున్నాడని చెప్పాడు. సౌతాఫ్రికాతో తొలి రెండు వన్డేల్లో కేఎల్ రాహుల్ 60(56 బంతుల్లో), రెండో మ్యాచ్2లో 66 నాటౌట్(43 బంతుల్లో) హాఫ్ సెంచరీలతో రాణించాడు. కేఎల్ రాహుల్ గురించి స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన డేల్ స్టెయిన్.. జట్టుకు తగ్గట్లు ఆడే మెచ్యూరిటీ అతనికి ఉందని చెప్పాడు. 'కేఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో బాగా తెలుసు. ఒకవేళ అతను టాప్-3లో బ్యాటింగ్ దిగితే.. కచ్చితంగా సెంచరీలు సాధించగలడు. కానీ ప్రస్తుతం అతను జట్టు కోసం ఆడుతున్నాడు. మిడిలార్డర్‌లో ఎలాంటి పాత్ర పోషించాలో అతనికి తెలుసు. తొలి వన్డేతో పాటు రెండో వన్డేలోనూ అతను హాఫ్ సెంచరీలు చేశాడు. ఎప్పుడూ తగ్గాలో.. ఎప్పుడు వేగంగా ఆడాలనే విషయంపై అతనికి అవగాహన ఉంది. కెప్టెన్‌గా కూడా రాహుల్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. తొలి వన్డేలో అతను జట్టును విజయపథంలో నడిపించాడు. రెండో మ్యాచ్‌లో జడేజాతో కలిసి దూకుడుగా ఆడాడు. ఫినిషింగ్ పాత్రలో అతను పరిణతితో వ్యవహరిస్తున్నాడు.'అని డేల్ స్టెయిన్ చెప్పుకొచ్చాడు.




## స్మృతి వేలికి ఎంగేజ్‌మెంట్ రింగ్ మిస్!

సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ తో వివాహం వాయిదా పడిన తర్వాత, భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన పెట్టిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పెళ్లి వాయిదా పడ్డాక స్మృతి తొలిసారిగా ఓ టూత్‌పేస్ట్ బ్రాండ్‌కు సంబంధించిన యాడ్ పోస్ట్ చేశారు. అయితే, ఇందులో ఆమె చేతికి ఎంగేజ్‌మెంట్ ఉంగరం లేకపోవడాన్ని గమనించిన అభిమానులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అయితే, ఆ యాడ్ షూటింగ్ ఎంగేజ్‌మెంట్‌కు ముందే జరిగి ఉండవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# రేపటి నుంచి జేపీఎల్ సందడి

## ఎస్‌జాట్ ఆధ్వర్యంలో టీ20 టోర్నీ.. పోటీలో 10 మీడియా సంస్థలు

జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జాట్) ఆధ్వర్యంలో డిసెంబర్ 7 నుంచి ఐదు రోజుల పాటు దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఈ టీ20 టోర్నీ జరగనుంది. తొలి సీజన్ తరహాలోనే మొత్తం పది మీడియా సంస్థల జట్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. ఈ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ)లో ఘనంగా జరిగింది. మాజీ క్రికెటర్, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్, ఎన్ఈసీసీ బిజినెస్ ఏజీఎం సంజీవ్ చింతావర్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాముండేశ్వర్ నాథ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులందరూ ఇలా ఒక వేదికగా క్రికెట్ ఆడుతుండటం అభినందీయమని అన్నారు. మీడియా సంస్థలన్నింటిని కలిపి జేపీఎల్‌ను నిర్వహిస్తున్న స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జాట్)ను ప్రత్యేకంగా అభినందించారు. క్రికెటర్ల ఆటతీరు, మ్యాచ్ ఫలితాలపై తమదైన శైలిలో విశ్లేషణలు చేసే జర్నలిస్టులకు ఇప్పుడు ఆటగాళ్ల కష్టాలు, వారు పడే శ్రమ ఈ జేపీఎల్ ద్వారా అర్థమవుతుందని చాముండేశ్వర్ నాథ్ చమత్కరించారు.



## ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడలేకే

ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడలేకనే ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించానని వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ ఆండ్రీ రస్సెల్ తెలిపాడు. సుదీర్ఘకాలం కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)కు ఆడిన రస్సెల్.. మినీ వేలానికి ముందు రిటైర్మెంట్ ప్రకటించాడు. అతని నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. తాజాగా ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రస్సెల్ తన రిటైర్మెంట్‌కు గల కారణాన్ని వెల్లడించాడు. 'ఐపీఎల్ చాలా పెద్ద టోర్నీ. మ్యాచ్‌ల సంఖ్య ఎక్కువ. ప్రయాణాలు కూడా చేయాల్సి ఉంటుంది. ప్రాక్టీస్, జిమ్, వర్క్‌లోడ్‌ను సమతూకంగా చేసుకోవడం చాలా కష్టం. ఆల్‌రౌండర్‌గా నాకు మరింత సవాల్. నేను కేవలం బ్యాటింగ్ చేస్తేనే సరిపోదు. ఒక మ్యాచ్‌లో కనీసం రెండు ఓవర్లపాటు బౌలింగ్ చేయాలి. నేను చక్కగా బౌలింగ్ చేయగలిగాను అనుకున్నప్పుడే.. బ్యాటింగ్‌లో రాణిస్తాను. నేను కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చి, సిక్స్‌లు కొడితే సరిపోతుందనుకోను. బ్యాటింగ్, బౌలింగ్ రెండూ చేసినప్పుడే నేను ఆటను ఆస్వాదించగలను.'అని చెప్పుకొచ్చాడు.

## థాంక్యూ రూట్: హెడెన్ కూతురు

యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గడ్డపై ఏళ్లుగా ఊరిస్తున్న శతకాన్ని ఎట్టకేలకు సాధించాడు జో రూట్. గబ్బా స్టేడియంలో పింక్ బాల్ టెస్టులో సూపర్ సెంచరీతో ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు రూట్. ఆసీస్ బౌలర్లను విసిగిస్తూ సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన రన్ మెషీన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ అయితే ఇంగ్లండ్ స్టార్‌కు మరీమరీ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ లెజెండ్ కూతురు గ్రేస్ సైతం రూట్‌కు ధన్యవాదాలు చెప్పింది. వీరిద్దరూ ప్రత్యేకంగా రూట్‌ను అభినందించడానికి ఓ కారణముంది. యాషెస్ సిరీస్ ప్రారంభానికి ముందు 'ఆల్ ఓవర్ బార్ ది క్రికెట్' అనే పాడ్‌కాస్ట్ షోలో మాథ్యూ హేడెన్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా 'యాషెస్ ఆల్‌టైమ్ జట్టు'లో రూట్ పేరు లేకపోవడాన్ని అతడు తప్పుపట్టాడు. ఫ్యాబ్ -4లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న రూట్‌ను పక్కన పెట్టడం అవివేకమని హేడెన్ అన్నాడు. అంతటితో ఆగకుండా ఎవరూ ఊహించని కామెంట్ చేశాడు. యాసెస్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ సెంచరీ చేయకుంటే తాను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో నగ్నంగా నడుస్తానని వెల్లడించాడు. హేడెన్ చేసిన కామెంట్స్‌పై అతడి కూతురు గ్రేస్ హ్యారిస్ ఫన్నీగా స్పందించింది. 'ప్లీజ్ రూట్.. సెంచరీ కొట్టు' అని కామెంట్ చేసింది. గబ్బాలో రూట్ సెంచరీ కొట్టడంతో ఖుషీ అయిన గ్రేస్.. ఇంగ్లండ్ స్టార్‌కు ధన్యవాదాలు తెలిపింది. 'రూట్ నీకు ధన్యవాదాలు. నువ్వు మా అందరి కళ్లను కాపాడావు' అని గ్రేస్ పోస్ట్ పెట్టింది.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 6-12-2025 | www.evarthalu.com

నేడు అంబేద్కర్ వర్ధంతి

# ఆదర్శమూర్తి.. అంబేద్కర్..





నీలి ఆకాశం చీల్చి..
నీ కలం రాసిన రేఖలు..
మెరుస్తున్నాయి భారత గడ్డ మీద!
నువ్వు తాకిన పుస్తకం..
ఇప్పుడు లక్షల చేతుల్లో అగ్ని జ్వాల
అంటరానితనాన్ని ఎదిరించిన నీ గొంతు..
ఇప్పటికీ ఒక్కో దళిత బిడ్డ గొంతు
అంటరాని తాకిడికి భయపడని
ఆ నీ చూపు ఇంకా బతికే ఉంది!
సమతా సింహాసనంపై నీ పేరు శాశ్వతం!!
జై అంబేద్కర్.. జై మానవత్వం

డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్, కేవలం ఒక వ్యక్తి కాదు, భారతదేశ సామాజిక విప్లవానికి, న్యాయానికి, సమానత్వానికి ప్రతీక. భారత రాజ్యాంగ ప్రధాన శిల్పిగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా, మేధో సంపన్నుడిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివి. సమాజంలో కుల వివక్షను రూపుమాపడానికి, పౌరులందరిలో సమానత్వాన్ని పెంపొందించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. 1891లో మహర్ కులంలో జన్మించిన అంబేద్కర్, చిన్ననాటి నుండి తీవ్రమైన సామాజిక-ఆర్థిక వివక్షను ఎదుర్కొన్నారు. ఉన్నత వర్గాల విద్యార్థులతో కలిసి కూర్చోవడానికి కూడా అనుమతి లేని పరిస్థితులలో ఆయన విద్యను కొనసాగించారు. అయినప్పటికీ, ఆయన పట్టుదల, జ్ఞాన తృష్ణ అపారమైనవి. కొల్హాపూర్ ఛత్రపతి రాజర్షి షాహు మహారాజ్ వంటి వారి ఆర్థిక సహాయంతో, ఆయన కొలంబియా విశ్వవిద్యాలయం-అమెరికా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్-బ్రిటన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో ఉన్నత విద్యను అభ్యసించారు. న్యాయశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రంలో ఆయన సాధించిన పాండిత్యం అద్వితీయం. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, అంబేద్కర్ తన జీవితాన్ని కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాడటానికి అంకితం చేశారు. ఆయన మనుధర్మ శాస్త్రాన్ని బహిరంగంగా దహనం చేయడం ద్వారా, సాంప్రదాయ వర్ణ వ్యవస్థపై తిరుగుబాటు చేశారు. దళితులకు బహిరంగ చెరువులలో నీరు తాగే హక్కును సాధించడం కోసం ఆయన చేసిన మహద్ సత్యాగ్రహం ఒక చారిత్రాత్మక ఘట్టం. అణగారిన వర్గాల సమస్యలను ప్రపంచానికి తెలియజేయడానికి ఆయన 'మూక్‌నాయక్' (మూగవారి నాయకుడు), 'బహిష్కృత్ భారత్' (బహిష్కరించబడిన భారతదేశం) వంటి మరాఠీ పత్రికలను ప్రారంభించారు. మహిళల హక్కుల కోసం, ముఖ్యంగా వారసత్వం, విడాకుల విషయంలో సమానత్వం కోసం ఆయన పోరాడారు. హిందూ కోడ్ బిల్లు విషయంలో ప్రభుత్వం నుండి తగినంత మద్దతు లభించకపోవడంతో ఆయన తొలి న్యాయ మంత్రి పదవికి రాజీనామా చేశారు. స్వతంత్ర భారతదేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా నియమితులైనప్పుడు, రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయన తన విశాలమైన అనుభవాన్ని, న్యాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక సమగ్రమైన, దూరదృష్టి గల రాజ్యాంగాన్ని రూపొందించారు. సమానత్వ హక్కు, స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో చేర్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాలను ప్రవేశపెట్టారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రజాస్వామ్యం ఉండాలని ఆయన బలంగా విశ్వసించారు. కేవలం రాజకీయ స్వాతంత్ర్యం సరిపోదని, సామాజిక, ఆర్థిక న్యాయం ద్వారానే నిజమైన స్వాతంత్ర్యం సాధ్యమవుతుందని ఆయన నమ్మారు. అంబేద్కర్ కేవలం సామాజిక సంస్కర్త మాత్రమే కాదు, గొప్ప ఆర్థికవేత్త కూడా. ఆయన భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటుకు సంబంధించిన ఆలోచనలకు పునాదులు వేశారు. స్థిరమైన ద్రవ్య విధానం, పారిశ్రామికీకరణ, జనాభా నియంత్రణ ఆవశ్యకత గురించి ఆయన ప్రతిపాదించిన ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికమైనవి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వారసత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన కలలుగన్న సమసమాజ స్థాపన దిశగా మనమంతా కృషి చేయాలి. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు శాశ్వతంగా నిలిచి ఉండేలా పాటుపడాలి.

- ఆరె శ్రీకాంత్, ఉపాధ్యాయుడు
సామాజిక వేత్త




# వెండి తెర ధ్రువతార.. సావిత్రి

భారతీయ సినిమా చరిత్రలో ఎంతోమంది నటీమణులు వచ్చారు, వెళ్లారు. కానీ 'మహానటి' అనే బిరుదుకు నిజమైన అర్థాన్నిచ్చిన వ్యక్తి సావిత్రి మాత్రమే. ఆమె కేవలం ఒక నటి కాదు, తెలుగు, తమిళ ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేసిన ఒక భావోద్వేగ ప్రతీక. ఆమె గొప్పతనం ఆమె అద్భుతమైన నటనలోనే కాదు, ఆమె జీవించిన తీరులోనూ, ఆమె ఎదుర్కొన్న సవాళ్లలోనూ, నేటి సమాజానికి ఆమె అందించిన స్ఫూర్తిలోనూ ఉంది. సావిత్రి గొప్పతనం ఆమె అప్రయత్నంగా ప్రదర్శించే సహజ నటనలో ఉంది. ఏ పాత్రకైనా ఆమె ప్రాణం పోసేవారు. దుఃఖం, సంతోషం, కోపం, హాస్యం.. నవరసాలను ఆమె తెరపై పలికించిన తీరు అనిర్వచనీయం.

'దేవదాసు' చిత్రంలో పార్వతిగా, 'మాయాబజార్'లో శశిరేఖగా, 'మిస్సమ్మ'లో లీలావతిగా ఆమె పోషించిన పాత్రలు క్లాసిక్స్ గా నిలిచాయి. కళ్ళతోనే వేల భావాలను పలికించే ఆమె సామర్థ్యం అరుదైనది. ఆమె నటించిన ప్రతి సినిమా ఒక పాఠం, ప్రతి హావభావం ఒక కళాఖండం. సావిత్రి జీవితం, ముఖ్యంగా ఆ కాలంలో, మహిళలకు ఒక పెద్ద సందేశం. ఆమె సినిమా రంగంలోకి ప్రవేశించినప్పుడు మహిళలు ప్రధాన పాత్రలు పోషించడం అరుదు. అయినా ఆమె తన నటనతో, క్రమశిక్షణతో అగ్రస్థానానికి చేరుకున్నారు. ఆమె తన కెరీర్‌ను తానే నిర్మించుకున్నారు. స్వంతంగా నిర్ణయాలు తీసుకున్నారు, ప్రేమించి పెళ్లి చేసుకున్నారు, స్వతంత్రంగా జీవించారు. పితృస్వామ్య సమాజంలో ఒక మహిళ తన కాళ్లపై తాను నిలబడి, తన కలలను నెరవేర్చుకోవడం ఆ కాలంలో ఒక విప్లవాత్మక చర్య. ఆమె స్టార్‌డమ్‌కు మించి ఆమె వ్యక్తిత్వం నిలిచింది. సావిత్రి దాతృత్వ గుణానికి ప్రసిద్ధి చెందారు. కష్టాల్లో ఉన్నవారికి, సహాయం అడిగిన వారికి 'లేదు' అనే మాట ఆమెకు తెలియదు. వెనకాముందు ఆలోచించకుండా సహాయం చేసే ఆమె స్వభావం ఆమెను 'మహానటి' స్థాయికి తీసుకువెళ్లింది. గొప్పతనం అంటే సంపాదించిన డబ్బు కాదు, పంచిన మనసు అని ఆమె నిరూపించారు. సావిత్రి జీవితం ఎంత వెలుగుమయంగా ఉండిందో, చివరి రోజులు అంత విషాదంగా ముగిశాయి. ఆమె ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లు, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య క్షీణత.. ఇవన్నీ ఆమె జీవితంలో చీకటి కోణాలు. అయినప్పటికీ, ఆమె పతనం కూడా నేటి సమాజానికి ఒక హెచ్చరిక, ఒక పాఠం. జీవితంలో ఒడిదుడుకులు సహజమని, విజయాన్ని చూసినప్పుడు వినమ్రంగా ఉండాలని, కష్టాల్లో కుంగిపోకుండా పోరాడాలని ఆమె జీవితం చెబుతుంది. ఆమె జీవితంలోని లోపాలు కూడా ఆమె మానవత్వాన్ని, బలహీనతలను చూపాయి, ఆమెను మరింత చేరువ చేశాయి. మహానటి సావిత్రి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె పోషించిన పాత్రలు, ఆమె వ్యక్తిత్వం నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు నిరంతర స్ఫూర్తిని అందిస్తున్నాయి. ధైర్యం, ప్రతిభ, దాతృత్వం, స్వాతంత్ర్యం.. ఈ లక్షణాల కలయికే సావిత్రి. మహిళలు తమ కలలను వెంబడించాలని, సమాజపు కట్టుబాట్లను తెంచుకుని ముందుకు సాగాలని, అదే సమయంలో మానవత్వాన్ని కోల్పోకూడదని ఆమె జీవితం సందేశం ఇస్తుంది. సినిమా తెరపై ఆమె మెరుపులు ఎప్పటికీ మసకబారవు. తెలుగు సినిమా చరిత్రలో ఆమె ఒక సువర్ణ అధ్యాయం, ఎప్పటికీ ఆరాధ్యదైవం.

- పురావస్తు ఆంజనేయులు, సినీ విమర్శకుడు



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.